# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No:-37ACDFM5465G1Z1

సంపుటి : 14 సంచిక : 361 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ : మహేష్ యాదవ్ 17-12-2025 పేజీలు : 12 వెల రూ.3/




ట్రైనీ కానిస్టేబుళ్లకు సీఎం చంద్రబాబు శుభవార్త...

## స్టైఫండ్ భారీగా పెంపు

- ట్రైనీ కానిస్టేబుళ్ల స్టైఫండ్ రూ.12,500కు పెంపు
- ఇప్పటివరకు రూ.4,500 గా ఉన్న స్టైఫండ్
- కొత్తగా ఎంపికైన 5,757 మందికి నియామక పత్రాలు
- అందించిన సీఎం, డిప్యూటీ సీఎం

మంగళగిరి

శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారి స్టైఫండ్‌ను ప్రస్తుతం ఉన్న రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. శాంతిభద్రతల పరిరక్షణకే తమ కూటమి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, ఈ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. పోలీసుల గౌరవాన్ని పెంచే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, ప్రజలకు రక్షణ కల్పించే బాధ్యత పోలీసులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన కానిస్టేబుళ్ల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి ఎంపికైన 5,757 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను

మిగతా 2లో

## ఆ కానిస్టేబుల్ ఉద్యోగంతోనే మా నాన్న మాకు జీవితాన్నిచ్చారు : పవన్ కల్యాణ్

- కొత్త కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల భద్రతే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- కానిస్టేబుల్‌గా మొదలైన తన తండ్రి ప్రస్థానమే తనకు స్ఫూర్తి అని వెల్లడి




## మాధవరం x కవిత

- మురిదిన పంచాయితీ
- కవిత భర్త అనిల్‌పై మాధవరం కృష్ణారావు భూకబ్జా ఆరోపణలు
- పరస్పరం ఆరోపణలు చేసుకున్న కవిత, ఎమ్మెల్యే
- వివాదం సంచలనంగా మారడంతో విచారణకు ఆదేశించిన ప్రభుత్వం






## నవోదయ, కేంద్రీయ.. బడులివ్వండి

కేంద్రానికి విజన్ డాక్యుమెంటు సమర్పణ

- పలువురు మంత్రులతో భేటీ
- సానుకూలంగా స్పందించిన ధర్మేంద్ర ప్రదాన్
- ఢిల్లీ టూర్లో రేవంత్ బిజీబిజి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటనలో బిజీగా గడిపారు. పలువురు మంత్రులను కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాల పై మంత్రులకు వినతి పత్రాలను అందజేశారు. కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌తో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి అందజేశారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు పెట్టే ఖర్చును ఎస్ఆర్బీఎం పరిధి నుంచి తొలగించాలని రేవంత్ కోరారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సీఎం సమావేశమయ్యారు. తొమ్మిది కేంద్రీయ విద్యాలయాలు, 16 నవోదయ పాఠశాలలను మంజూరు చేయాలని ఆయనను కోరారు.

నాలుగు లక్షల మందికి మెరుగైన విద్య అందుతుందని తెలిపారు. తెలంగాణలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు సహకరించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో.. మిగతా 2లో...




## వామపక్ష హింస తగ్గింది

- మావోయిస్టు హింసాత్మక ఘటనలు 89శాతానికి కుదించి వేశాం
- కేంద్ర మంత్రి నిత్యానంద్ రాయ్




## ఇంటర్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

- ఇంటర్ విద్యార్థులకు అలర్ట్
- మూడు పరీక్షల్లో మార్పులు
- మార్చి 3న జరగాల్సిన సెకండియర్ పరీక్షలు మార్చి 4న నిర్వహణ




## మూడో విడత "పంచాయితీ"

- ఎన్నికలకు అంతా సిద్ధం..
- 3,752 పంచాయతీల్లో పోలింగ్

**హైదరాబాద్:** తెలంగాణలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. బుధవారం నాడు 182 మండలాల్లోని 3,752 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ జరగనుంది. ఈ విడతలో 4,159 సర్పంచి స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో 394 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 3,752 సర్పంచి స్థానాలకు 12,652 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తం 36,425 వార్డులకుగాను 7,908 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 28,410 వార్డులకు 75,725 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. 11 సర్పంచి స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. రెండు గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిలిపివేశారు.




## అమ్మా నాన్నలను పట్టించుకోకుంటే ఊరుకోం

- సీపీ సజ్జనార్ హెచ్చరిక
- వృద్ధుల సంరక్షణ పిల్లల బాధ్యత అ
- నిర్లక్ష్యం చేసే వారిపై చట్ట పరమైన చర్యలు
- సమస్యలున్న వృద్ధులు నేరుగా నా వద్దకు రండి
- సీపీ సజ్జనార్




## యమునా హైవేపై బీభత్సం

8 బస్సులు..3 కార్లు ఢీ

బస్సులు కాలిపోయాయి..

నలుగురు సజీవ దహనం




## టీటీడీ కీలక నిర్ణయాలు...

### అర్చకుల వేతనం రూ.45 వేలకు పెంపు



తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి భక్తుల సౌకర్యం, సంస్థాగత బలోపేతం లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. తిరుపతిలో 20 ఎకరాల విస్తీర్ణంలో భారీ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మించాలని, ముంబైలోని బాంద్రాలో శ్రీవారి ఆలయాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ మేరకు ఆమోదం తెలిపారు. సమావేశం అనంతరం ఛైర్మన్ బీఆర్ నాయుడు మీడియాకు వివరాలు వెల్లడించారు. భక్తుల కోసం తిరుపతిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ప్లానింగ్, ఆర్కిటెక్ట్ నియామకానికి బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. అదేవిధంగా, ముంబై బాంద్రాలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. టీటీడీ ఆలయాల్లోని ధ్వజస్తంభాలు, రథాల తయారీకి అవసరమైన కలప కోసం పలమనేరులో 100 ఎకరాల్లో దివ్య వృక్షాలను పెంచే ప్రతిపాదనకు కూడా ఆమోదముద్ర వేశారు.

# కాంగ్రెస్ బెదిరింపులకు భయపడకండి

**హైదరాబాద్** : తెలంగాణలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అధికార మదం తలకెక్కిందని, ప్రజలను మరియు ప్రజాప్రతినిధులను చంపేస్తామంటూ బరితెగించి మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఖానాపూర్, షాద్ నగర్ నియోజకవర్గాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల బెదిరింపులకు భయపడవద్దని ధైర్యం చెప్పారు.

"కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధికార అహంకారంతో ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నారు. ఒక ఎమ్మెల్యే అయితే 'నన్ను ఓడించి చంపేస్తే.. నేను మిమ్మల్ని గెలిచి చంపేస్తా' అని బహిరంగంగా బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఎమ్మెల్యేల ప్రవర్తన చూసి కాంగ్రెస్ కార్యకర్తలు కూడా గ్రామాల్లో అరాచకాలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. సర్పంచులు ఎవరూ ఇలాంటి బెదిరింపులకు లొంగవద్దన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకపోవడానికి ఈ ఎమ్మెల్యేలు ఎవరని ఆయన ప్రశ్నించారు. అవి వాళ్ల అబ్బ సొత్తు, వాళ్ల అత్త సొత్తు కాదన్నారు. రేవంత్ రెడ్డి ఏమైనా తన భూములు అమ్మి గ్రామాలకు నిధులిస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రజల పైసలతో కడుతున్న ఇళ్లకు అర్హులను ఎంపిక చేసే పూర్తి అధికారం గ్రామ సభలకు, సర్పంచులకే ఉంటుందన్నారు.

ఎవడైనా అడ్డుతగిలితే తాట తీసి లైన్ లో పెట్టండి" అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే నిధులు దిక్కులేక ప్రపంచబ్యాంకుకు ఉత్తరాలు రాస్తున్నారని, అలాంటి సర్పంచ్ లకు ఏం ఇస్తారని కేటీఆర్



ఎద్దేవా చేశారు. రెండు సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా గ్రామ పంచాయితీలకు ఇవ్వని కాంగ్రెస్, ఇప్పుడు ఎలా గ్రామాలకు నిధులు ఇస్తారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ నేతలు తమ ఇండ్లు భూములు అమ్మి నిధులివ్వడం లేదని, ప్రజల సొమ్ములకు ధర్మకర్తలు మాత్రమే అని గుర్తుంచుకోవాలని కేటీఆర్ హెచ్చరించారు.

గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు ఎవరి భిక్ష కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ఐదు అంచెల పాలనలో గ్రామ పంచాయతీలకు స్వయం ప్రతిపత్తి ఉందని గుర్తు చేశారు. "కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నుంచి రావాల్సిన రూ. 3,500కోట్ల నిధుల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసి, రిజర్వేషన్లను 24% నుంచి 17%కి తగ్గించి హడావుడిగా ఎన్నికలు జరిపింది. ఫైనాన్స్ కమిషన్ నిధుల్లో 70 శాతం నేరుగా గ్రామ పంచాయతీలకే రావాలి. ఆ నిధులను ఆపే హక్కు ఏ ముఖ్యమంత్రికి గానీ, ఎమ్మెల్యేకు గానీ లేదు. మీ హక్కుల కోసం కొట్లాడండి, బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుంది" అని హామీ ఇచ్చారు. ఇందుకోసం జిల్లాకొక ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటుతోపాటు, స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

కాంగ్రెస్ పాలనలో పల్లెలు సంక్షోభంలో.. యూరియా కోసం యుద్ధాలు

కేసీఆర్ పాలనలో పల్లెలు పచ్చగా ఉండేవని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో అనాథలయ్యాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "కేసీఆర్ హయాంలో ప్రతి గ్రామానికి ట్రాక్టర్, ట్యాంకర్, నర్సరీ, వైకుంఠ ధామం వచ్చాయి. తెలంగాణ పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలిచి 30 శాతం జాతీయ అవార్డులు గెలుచుకున్నాయి. కానీ నేడు పరిస్థితి దారుణం. ట్రాక్టర్లకు డీజిల్ పోయించే దిక్కు లేదు. రైతులు యూరియా కోసం లైన్లలో నిలబడి బాధలు పడుతున్నారని, ఆ చెప్పుల లైన్లు కనపడితే ప్రభుత్వం పరువు పోతుందని ముఖ్యమంత్రి తెలివిగా 'యూరియా యాప్' అనే కొత్త స్కీమ్ తెచ్చారు. షాపులో దొరకని యూరియా యాప్‌లో దొరుకుతుందా?" అని ఎద్దేవా చేశారు.

**మళ్ళీ వచ్చేది మన ప్రభుత్వమే**

సర్పంచ్ ఎన్నికల కోసం ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలు తిరుగుతూ ప్రచారం చేయడం చరిత్రలో ఎన్నడూ లేదని కేటీఆర్ విమర్శించారు. ఎన్టీఆర్, వైఎస్ఆర్, కేసీఆర్ వంటి నాయకులు ఏనాడూ సర్పంచ్ ఎన్నికల కోసం రోడ్ల మీద పడలేదన్నారు. రేవంత్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే విజయోత్సవాల పేరుతో పరోక్ష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. "ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండేది ఇంకో రెండేళ్లే. మళ్ళీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే. మీరు ఐదేళ్ల కోసం గెలిచారు, మిగిలిన సగం కాలం మన ప్రభుత్వంలోనే అభివృద్ధి పనులు చేసుకుంటారు. ఖానాపూర్, షాద్ నగర్ గడ్డపై మళ్ళీ గులాబీ జెండా ఎగురడం ఖాయం" అని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీ ఎన్నికల్లో ఐకమత్యంతో కలిసి పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఖానాపూర్ ఇంచార్జీ జాన్సన్ నాయక్, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నవోదయ, కేంద్రీయ బడులివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

105 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఈ స్కూల్స్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 లక్షల మంది విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని నిర్మలా సీతారామన్‌కు రేవంత్ తెలిపారు. ఈ స్కూల్స్ నిర్మాణం, ఇతర విద్యా సంస్థల ఏర్పాటుకు 30 వేల కోట్ల రూపాయల వ్యయమవుతుందని వివరించారు. ఈ స్కూల్స్ కోసం తీసుకునే రుణాలను ఎస్ఆర్బీఎం నుంచి మినహాయించాలని కేంద్ర ఆర్థికమంత్రిని కోరారు.

సానుకూలంగా స్పందించిన ధర్మేంద్ర ప్రదాన్ : తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసిన రేవంత్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. హైదరాబాద్‌కు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ మంజూరు చేయాలని కోరారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల భూమిని ఇప్పటికే గుర్తించినట్లు కేంద్ర మంత్రికి తెలిపారు. వెంటనే తరగతులు ప్రారంభించడానికి ట్రాన్సిట్ క్యాంపస్ కూడా సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి కేంద్రమంత్రికి వివరించారు. ఐఐఎం ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తే అవసరమైన వసతులు కల్పిస్తామని తెలిపారు.

తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా 9 కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఆయా కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఇతర వసతులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నట్టు వివరించారు. సానుకూలంగా స్పందించిన ధర్మేంద్ర ప్రదాన్ యంగ్ ఇండియా స్కూల్స్ ప్రాజెక్టు డీపీఆర్ పంపాలని రేవంత్‌కు చెప్పారు. డీపీఆర్‌ను పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ప్రదాన్ చెప్పినట్టు ఆయనతో భేటీ తర్వాత ముఖ్యమంత్రి వివరించారు.

# మాధవరం x కవిత

**హైదరాబాద్:** రాష్టంలో మీడియా ఛానల్స్ లో, సోషల్ మీడియాలలో విస్తృతంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వర్సెస్ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్న థంబ్ నెయిల్స్ ట్రోల్ అవుతున్నాయి. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ కవిత ప్రెస్ మీట్‌లు, కవితను టార్గెట్ చేసి తగ్గేది లేదన్న ధోరణిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కౌంటర్ అటాక్‌లతో గత వారం రోజులుగా వీరిద్దరి మధ్య గొడవ కొనసాగుతున్నది. రాష్ట్రంలో ఇది ఇప్పుడు ఒక హాట్ టాపిక్‌గా మారింది. కూకట్‌పల్లిలోని ఐడిపిఎల్ భూములలో 150 ఎకరాల భూమిని కబ్జా చేసి 4 వేల కోట్ల రూపాయలు కుంభకోణం జరిగింది. దాని వెనుక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఉన్నాడని కవిత ఆరోపణలు చేస్తే.. కవిత భర్త తప్పుడు పత్రాలతో ఐడిపిఎల్ భూములను 18 ఎకరాల కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపణలు చేస్తున్నారు. ఇద్దరి మధ్య వివాదం కుటుంబ సభ్యులు చేస్తున్న వ్యాపారల వరకు చేరింది.

అసలు సంగతి......

కూకట్‌పల్లి నియోజకవర్గంలో డిసెంబర్ 8వ తేదీన జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన జనం బాట కార్యక్రమంలో పాల్గొన్న కల్వకుంట్ల కవిత కూకట్‌పల్లిలోని పలు ప్రాంతాలను పర్యటించి స్థానిక సమస్యలపై మీడియా సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే వ్యాపారాలపై ఉన్న ధ్యాస నియోజకవర్గ అభివృద్ధిపై పెట్టాలని ఆరోపించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యేలు బీటి (బంగారు తెలంగాణ) బ్యాచ్ అంటూ ఆరోపించారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు భూములు, చెరువులు కబ్జా చేశారు ఆధారాలతో త్వరలో బయట పెడతానని అన్నారు. మీడియా సమావేశంలో కవిత చేసిన ఆరోపణలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఘాటుగానే రిప్లై ఇచ్చారు. కవిత బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో అక్రమలకు పాల్పడిందని, ఐడిపిఎల్ భూములలో ఓవర్ ల్యాపింగ్ భూమి 18 ఎకరాలు తప్పుడు పత్రాలతో కబ్జా చేసి కవిత భర్త రియల్ ఎస్టేట్ వెంచర్ నడుపుతున్నారని, భారీ నిర్మాణలు చేపడుతున్నారని ఆరోపించారు.

# ఆ కానిస్టేబుల్ ఉద్యోగంతోనే మా నాన్న మాకు జీవితాన్నిచ్చారు: పవన్ కల్యాణ్

**గత ప్రభుత్వ హయాంలో పెరిగిన గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలను అరికట్టాలని పిలుపు**

**నియామక ప్రక్రియ పూర్తిచేసిన సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనితకు అభినందనలు**

కూటమి ప్రభుత్వం ప్రజల మానప్రాణాల సంరక్షణకు, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ముఖ్యంగా మహిళల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. కొత్తగా ఎంపికైన 6,100 మంది కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు పవన్ కూడా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి తరతమ భేదాలకు తావుండదని, కొత్త కానిస్టేబుళ్లు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పవన్ తన తండ్రిని గుర్తుచేసుకుంటూ భావోద్వేగపూరిత ప్రసంగం చేశారు. "నా తండ్రి కూడా కానిస్టేబుల్‌గానే ఉద్యోగ జీవితం ప్రారంభించారు. పనిలో నిబద్ధత, ఎదగాలన్న బలమైన కాంక్షతో ప్రమోషన్లు పొంది ఏఎస్ఐ స్థాయికి చేరుకున్నారు. ఆ కానిస్టేబుల్ ఉద్యోగంతోనే మాకు జీవితాన్నిచ్చారు, చదివించారు. ఆయన విలువలతో కూడిన ప్రస్థానమే మాకు స్ఫూర్తి. మీలా ఒక కానిస్టేబుల్‌గా ప్రారంభమైన మా నాన్నగారు ఇచ్చిన స్ఫూర్తే నన్ను ఈరోజు మీ ముందు నిలబెట్టింది" అని తెలిపారు. కానిస్టేబుళ్లే పోలీస్ శాఖకు మూల స్తంభాలని, వారి ధైర్యమే శాఖకు జీవమని కొనియాడారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి శాంతిభద్రతలతోనే ముడిపడి ఉందని పవన్ కల్యాణ్ అన్నారు. "ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తమ రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు రావడానికి పటిష్ఠమైన శాంతిభద్రతలే కారణమని చెప్పారు. మన ముఖ్యమంత్రి చంద్రబాబు గారు చెప్పేది కూడా ఇదే. శాంతిభద్రతలు కల్పించడంలో మీరే కీలక పాత్ర పోషించాలి" అని సూచించారు. పోలీసులు ధరించే ఖాకీ చొక్కా సమాజానికి రక్షణ కవచం లాంటిదని, దాని గౌరవాన్ని కాపాడాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయని పవన్ విమర్శించారు. క్రికెట్ బెట్టింగ్, గంజాయి, డ్రగ్స్ వంటివి గ్రామ స్థాయికి చేరాయని, సైబర్ మోసాలు పెరిగిపోయి అమాయకులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటిత నేరాల నియంత్రణపై కొత్త కానిస్టేబుళ్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇటీవల కొన్ని తీవ్రవాద జాడలు కూడా బయటపడుతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. 2022లో నోటిఫికేషన్ ఇచ్చి, న్యాయపరమైన చిక్కులు వస్తే గత ప్రభుత్వం పట్టించుకోలేదని, దీనివల్ల అర్హత సాధించిన అభ్యర్థులు మూడేళ్ల విలువైన సమయాన్ని కోల్పోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, హోంమంత్రి వంగలపూడి అనిత పట్టుదలతో న్యాయపరమైన అడ్డంకులను తొలగించి, నియామక ప్రక్రియను వేగంగా పూర్తి చేశామని తెలిపారు.

# అమ్మా నాన్నలను పట్టించుకోకుంటే ఊరుకోం



**హైదరాబాద్** : కన్న పిల్లల చేత నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురవుతున్న వృద్ధ తల్లిదండ్రుల సంఖ్య పెరగడంపై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా, అంతకు ముందు సైబరాబాద్, టీజీఎస్ఆర్టీసీ, ఇతర జిల్లాల్లో పనిచేసిన అనుభవంతో తాను ఎన్నో సంఘటనలు చూశానని సజ్జనార్ తెలిపారు. ప్రతిరోజూ తనను కలిసే వందలాది పిటిషనర్లలో పిల్లలు పట్టించుకోకపోవడంతో నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులను చూసినప్పుడు తన మనసు తీవ్రంగా కలత చెందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను చూసుకోవడం అనేది పిల్లలు చేసే సాయమో, వారిపై మోపే భారమో కాదని, అదొక జన్మ హక్కని ఆయన స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి సాకులు, చర్చలకు ఆస్కారం లేదన్నారు.

"ఈరోజు మీరు మీ తల్లిదండ్రులతో ఎలా ప్రవర్తిస్తారో, రేపు మీ పిల్లలకు అదే ఒక పాఠం అవుతుంది. ఈ తరం చేసే పనులే తర్వాతి తరానికి మార్గనిర్దేశం చేస్తాయి" అని సజ్జనార్ హితవు పలికారు. వృద్ధ తల్లిదండ్రులను వేధించడం లేదా వదిలివేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా వృద్ధులకు ఆయన భరోసా ఇచ్చారు. "మీరు ఒంటరి కారు. మీకు ఎలాంటి సమస్య ఉన్నా సంకోచించకుండా నేరుగా నన్ను సంప్రదించవచ్చు. మీ ఆత్మగౌరవం, భద్రత, శ్రేయస్సు కాపాడటం హైదరాబాద్ పోలీసుల బాధ్యత" అని ఆయన హామీ ఇచ్చారు.

# త్రైనీ కానిస్టేబుళ్లకు సీఎం చంద్రబాబు శుభవార్త...

# స్టైఫండ్ భారీగా పెంపు

మొదటిపేజీ తరువాయి

అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ అసమర్థ పాలనతో రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టపోయిందని, రాష్ట్రాన్ని పునర్నిర్మించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న హామీని నిలబెట్టుకుంటున్నామన్నారు. అనేక కోర్టు కేసులను అధిగమించి ఈ నియామక ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. మొత్తం 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, 6,014 మంది ఎంపికయ్యారని, వారిలో 5,757 మంది శిక్షణకు హాజరయ్యారని వివరించారు. వీరిలో 3,343 మంది సివిల్, 2,414 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారన్నారు. గతంలో తాను అమలు చేసిన 33 శాతం రిజర్వేషన్ల వల్లే నేడు 993 మంది మహిళలు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారని గుర్తుచేశారు. గిరిజన ప్రాంతాల నుంచి 183 మంది ఆదివాసీ యువత ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. క్రిస్మస్, సంక్రాంతి పండుగలతో పాటు ఈ నియామకాల పండుగ కూడా అందరిలో సంతోషాన్ని నింపిందని ఆయన వ్యాఖ్యానించారు.

## పారదర్శకంగా నియామక ప్రక్రియ

గత ప్రభుత్వం కేవలం మొక్కుబడిగా నోటిఫికేషన్ ఇచ్చిందని, తాము రికార్డు సమయంలో కేవలం 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించామని చంద్రబాబు తెలిపారు. అవినీతికి తావు లేకుండా, మానవ ప్రమేయాన్ని తగ్గిస్తూ పూర్తిగా టెక్నాలజీ సాయంతో పారదర్శకంగా ఎంపికలు పూర్తి చేశామన్నారు. డిజిటల్ మీటర్లతో కొలతలు, ఆర్ఎఫ్ఐడీ చిప్‌లతో పరుగు పందెం నిర్వహించి లైవ్‌గా రికార్డ్ చేశామని వివరించారు.

# ఇంటర్ షెడ్యూల్ లో స్వల్ప మార్పు



**విశ్వంభర, హైదరాబాద్** : మార్చి 3న జరగాల్సిన సెకండియర్ పరీక్షలను మార్చి 4న నిర్వహించనుంది. తెలంగాణ ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్లో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. వచ్చే ఏడాది మార్చి 3న జరగాల్సిన ఇంటర్మీడియట్ సెకండియర్ బోటనీ, మ్యాథ్స్ 2ఏ, పొలిటికల్ సైన్స్ పరీక్షలను మరుసటి రోజు (మార్చి 4న) నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు తెలిపింది. మార్చి 3న హోలీ పండగ ఉండటంతో పరీక్షల తేదీలో మార్పు చేసినట్లు వెల్లడించింది. మిగతా పరీక్షలు యథాతథంగా నిర్వహించనున్నట్లు బోర్డు వెల్లడించింది. ఫస్ట్ ఇయర్ పరీక్షల్లో ఎటువంటి మార్పు లేదు.

ఫిబ్రవరి 25 తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం ఇంటర్ వార్షిక పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. 25న ఫస్ట్ ఇయర్, 26వ తేదీన సెకండియర్ పరీక్షలు మొదలుకానున్నాయి. సబ్జెక్టుల వారీగా పరీక్షల కాలపట్టికను ఇంటర్ బోర్డు గతంలో విడుదల చేసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాత పరీక్షలు నిర్వహిస్తారు. ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 21 వరకు ప్రతి రోజూ 2 షిఫ్టుల్లో నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 12, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్స్ జరుగుతాయి. ఇంగ్లీష్‌లో ప్రాక్టికల్స్ (20 మార్కులకు) ఫస్టియర్ విద్యార్థులకు జనవరి 21న, సెకండియర్‌కు 22న జరుగుతాయి. ప్రథమ ఏడాది విద్యార్థులకు జనవరి 24వ తేదీన పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తామని కృష్ణ ఆదిత్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ కలిపి సుమారు 9.50 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

చక్కని ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధం : ఇంటర్మీడియట్ పరీక్షలకు చాలా తక్కువ సమయం ఉంది. ఇప్పటి నుంచే పిల్లలు పబ్లిక్ పరీక్షలపై దృష్టి పెట్టేలా తల్లిదండ్రులు, అధ్యాపకులు చూసుకోవడం మంచిది. చక్కని ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధం అయితే విజయం తథ్యమని అంటున్నారు నిపుణులు. ఈ టైంలో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా బలంగా ఉండటం కూడా చాలా అవసరం. ఇందుకు విద్యార్థులతో ధ్యానం, యోగా, వ్యాయామం లాంటివి సాధన చేయించడం ఎంతో అవసరం.

ఎప్పటికప్పుడు రివిజన్ : ఇప్పటికే పూర్తైన పాఠ్యాంశాలు ఎప్పటికప్పుడు రివిజన్ చేసుకోవాలి. అందులోని ప్రధాన అంశాలను ప్రత్యేకంగా నోట్స్‌లో రాసుకుంటూ ఉండటం చాలా మంచిది. ప్రిపేర్ అయిన టాపిక్స్‌పై గతంలో ప్రశ్నలు ఏ విధంగా ఇచ్చారనేది పరిశీలన చేయాలి. గత ప్రశ్నపత్రాలను సాధన చేయడం వల్ల ప్రశ్నలు ఇచ్చే తీరు అర్థం అవుతుంది.

సమ యం వృథా చేయవద్దు : ఇంటర్మీడియట్ అనేది విద్యార్థిల జీవితంలో ఓ కీలకమైన దశ. పరీక్షల్లో ఎక్కువ మార్కుల సాధనకు సమయపాలన చాలా అవసరం. అందువల్ల టైం వృథా చేయవద్దు. సరైన ప్రణాళికతో చదివినట్లయితే ఉత్తమ మార్కులు పొందటం చాలా సులభమని నిపుణులు అంటున్నారు.

# యమునా హైవేపై బీభత్సం



యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై భారీ రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. వరుసగా ఒకదానికొకటి ఢీకొన్న బస్సులు, కార్లు.. ఢీకొన్నాయి. దీంతో ఒక్కసారిగా రోడ్డుపై మంటలు చెలరేగాయి. మంటలు ప్రాణభయంతో ప్రయాణికుల ఆర్తనాదాలతో యమునా రోడ్డు మారుమోగిపోయింది. కొంతమంది ప్రయాణికులు లోపల చిక్కుకొని ప్రాణాలు కోల్పోగా.. మరికొందమంది వాహనాలనుంచి దూకి బతుకు జీవుడా అంటూ బయటపడ్డారు. పొల్యూషన్ ఎఫెక్ట్‌తో మంగళవారం తెల్లవారు జామున ఢిల్లీ, ఆగ్రా హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు సజీవ దహనమయ్యారు. మరికొందరు ప్రయాణికులు గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు.

మంగళవారం (డిసెంబర్ 16) తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో మధుర సమీపంలోని భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై దట్టమైన పొగమంచు కారణంగా ఆరు బస్సులు, రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయంతో కేకలు పెట్టారు. మంటల్లో నలుగురు సజీవ దహనమయ్యారు. ఆగ్రా నుంచి నోయిడాకు వెళ్తున్న వాహనాలు గుంతలో పడటంతో ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నలుగురు మంటల్లో సజీవ దహనమయ్యారు. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వామపక్ష హింస తగ్గింది

: పదిహేనేళ్ళలో వామపక్ష తీవ్రవాదానికి సంబంధించిన హింసాత్మక సంఘనటలు 89శాతం మేరకు వరకు తగ్గుముఖం పట్టాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2010లో గరిష్ఠంగా 1,936 ఘటనలు నమోదవగా.. 2025 నాటికి 222కు చేరాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ లోక్‌సభలో ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు తీసుకువచ్చిన జాతీయ విధానంకార్యచరణ ప్రణాళిక సమర్థవంతంగా అమలవుతోందన్నారు. పౌరులు, సిబ్బంది మరణాలు 2010లో గరిష్ఠంగా 1,005 ఉండగా.. 91శాతం తగ్గి 2025 నాటికి 95కు చేరాయని పేర్కొన్నారు. ప్రభావిత జిల్లాల సంఖ్య ఏప్రిల్ 2018లో 126 నుంచి 90కి, జులై 2021లో 70కి, ఏప్రిల్ 2024లో 38కి, ఈ ఏడాది ఏప్రిల్ నాటికి 18, అక్టోబర్ వరకు కేవలం 11కి తగ్గాయన్నారు. ప్రస్తుతం మూడు జిల్లాలు మాత్రమే ప్రభావిత జిల్లాలుగా వర్గీకరించామన్నారు.

గిరిజన, మారుమూల ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టడం మావోయిజం మూల కారణాలను పరిష్కరించిందన్నారు. మెరుగైన శాంతిభద్రతలు, భద్రతా పరిస్థితులు, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడుల పెరుగులతో సహా మెరుగైన ఆర్థిక అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాయన్నారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో చేరేలా ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్రాలు సమగ్ర లొంగుబాటుపునరావాస విధానాలను రూపొందించాయన్నారు. ఎస్ఆర్ఈ పథకం కింద లొంగిపోయిన వారి పునరావాసం కోసం రాష్ట్రాలు చేసిన ఖర్చును కేంద్ర ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందన్నారు. పునరావాస ప్యాకేజీలో ఉన్నత స్థాయి కేడర్‌కు రూ.5లక్షలు, క్యాడర్‌కు రూ.2.5లక్షల తక్షణ గ్రాంట్ ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ స్కీమ్‌లో ఆయుధాలు, మందుగుండును అప్పగించినందుకు ప్రోత్సాహకాలు అందిస్తారన్నారు. అదనంగా నచ్చిన వృత్తి, వ్యాపారంలో శిక్షణ ఇచ్చేందుకు మూడు సంవత్సరాల పాటు నెలకు రూ.10వేల ఉపకార వేతనం అందించే సదుపాయం కూడా ఉంటుందన్నారు. రోడ్డు నెట్‌వర్క్ విస్తరణ, టెలికమ్యూనికేషన్ కనెక్టివిటీ మెరుగుదల, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సమ్మిళితంపై ప్రత్యేక దృష్టి సారించి, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల కోసం అనేక ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని కేంద్ర సహాయ మంత్రి వివరించారు. పదేళ్లలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 656 పోలీస్‌స్టేషన్లు, ఆరేళ్లలో 377 కొత్త ప్రత్యేక పోలీస్ శిబిరాలు ఏర్పాటు చేసిన మావోయిస్టులను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు మంత్రి వివరించారు. 14,987 కిలోమీటర్ల రహదారులను నిర్మించడంతో పాటు టెలికమ్యూనికేషన్ కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు 9,118 టవర్లను ఏర్పాటు చేశామన్నారు. నైపుణ్యాభివృద్ధి కోసం 46 పారిశ్రామిక శిక్షణా సంస్థలు, 49 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ప్రారంభించినట్లు చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను అందించడానికి 179 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోస్టల్ శాఖ ఆయా జిల్లాల్లో బ్యాంకింగ్ సేవలతో కూడిన 6,025 పోస్టాఫీసులను ప్రారంభించిందని, భౌగోళిక రాజకీయ హింసతో అత్యంత ప్రభావితమైన జిల్లాల్లో 1,804 బ్యాంకు బ్రాంచ్‌లు, 1,321 ఏటీఎంలను ప్రారంభించారన్నారు. అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి, వామపక్ష తీవ్రవాదంతో అత్యంత ప్రభావితమైన జిల్లాల్లోని కీలకమైన ప్రజా మౌలిక సదుపాయాల లోపాలను పరిష్కరించడానికి ప్రత్యేక కేంద్ర సహాయం (SCA) పథకం కింద నిధులను అందజేస్తున్నట్లు వివరించారు. 2017లో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి రూ.3,912.98 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు.

బుధవారం 17 డిసెంబర్ 2025
పల్లె వెలుగు
రాష్ట్రీయం-జాతీయం STATE-NATIONAL 03

## పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం కొరకు విరాళం




**నంద్యాల . డిసెంబర్ 16. (పల్లె వెలుగు ):**

నంద్యాల మోడల్ ప్రైమరీ స్కూల్ రాయమాల్పురం పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం కొరకు హెచ్ఎమ్ లక్ష్మణ్ నాయక్ 10000/- మరియు ఉపాధ్యాయురాలు సుజాత అన్నపూర్ణాదేవి 2500/-విరాళం అందించారు. మరియు గ్రామ మాజీ డీలర్ మండ్ల గోపాల్ 2000/- విరాళం అందించినట్లు పాఠశాల ఇంచార్జీ హెచ్ఎమ్ ఆనంత లక్ష్మి తెలిపారు.వారికి తోటి ఉపాధ్యాయులు ఓబయ్య, సత్యవతమ్మ మరియు విద్యార్థులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## బాధితుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి



- పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
- ఓర్వకల్లు స్టేషన్‌లో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ వార్షిక తనిఖీ

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను సానుకూలంగా ఆలకించి, వారికి సత్వర పరిష్కారం చూపాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను, పెండింగ్ కేసుల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం (ఓపెన్ డ్రింకింగ్) వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి, కేసులు నమోదు చేయాలని సూచించారు. ప్రాపర్టీ కేసులను ఛేదించి రికవరీని వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయడంతో పాటు.. సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.ఈ తనిఖీల్లో ఎస్పీ వెంట కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాద్, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, డిసిఆర్బి సీఐ గుణశేఖర్ బాబు, ఓర్వకల్లు ఎస్సై సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో పై అవగాహన



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 16 :**

పల్స్ పోలియో కార్యక్రమం పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్తలు ఎం ఎల్ హెచ్ పీ లు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లతో వైద్యాధికారులు భావన రెడ్డి సవిత పబ్లిక్ హెల్త్ నర్స్ లక్ష్మీదేవి సూపర్వైజర్ రవికుమార్ లు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ డిసెంబర్ 21వ తేదీ ఆదివారం బూత్ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. జీరో నుండి ఐదు సంవత్సరాల వయసు కలిగిన పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని అన్నారు 22వ తేదీ 23వ తేదీ లలో ఇంటింటికి తిరిగి మార్కింగ్ వేస్తూ అందులో తప్పిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని అన్నారు. వివిఎం ( వ్యాక్సిన్ వైల్ మానిటర్ ) గురించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పిల్లలకు మార్కింగ్ వేయడం గురించి తెలియజేశారు. మండలంలో జీరో నుండి ఐదు సంవత్సరాలు వయసులో గలిగిన పిల్లలు 3010 మంది ఉన్నట్టు గుర్తించడం జరిగిందని అన్నారు. ఎర్రగుంట్ల, నంద్యాల మండల పరిధిలోని బిల్లలాపురం, కొత్తపల్లి గ్రామంలో ఒక్కొక్కటి చొప్పున ఏ కోడూరు, బి కోడూరు, కొత్తపల్లి,బండి ఆత్మకూరులో రెండు చొప్పున,బండి ఆత్మకూరు రెండవ సచివాలయంలో, పార్లపల్లి లో,మూడేసి చొప్పున మొత్తం 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని వైద్యాధికారులు సవిత భావన రెడ్డిలు వివరించారు.

## పంటల సాగులో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై శిక్షణ

**దొర్నిపాడు డిసెంబర్ 16 పల్లె వెలుగు న్యూస్**

మండల కేంద్రమైన దొర్నిపాడు రైతు భరోసా కేంద్రం నందు మంగళవారం పంటల సాగులో రైతులు తీసుకోవలసినజాగ్రత్తలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి ప్రమీల తెలిపారు ,ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్నికోయిలకుంట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ. సుధాకర్ అధ్యక్షతననిర్వహించడం జరిగింది.కార్యక్రమం లో రైతులకు పలు సూచనలు , సలహాలు ఇవ్వడం జరిగింది.జొన్న పంటలో ఎరువులు దఫాలుగా వేసుకోవాలని, శనగ పంట వేసిన రైతులు ఎండు తెగులు నివారణ కోసం లీటరు నీటికి 5 గ్రాముల ట్రికోడెర్మా విరిడీ చొప్పున ఎకరాకు 200 లీటర్లు లేదా కార్బండాజిమ్ లీటరు నీటికి 1 గ్రాముల చొప్పున ఎకరానికి 200 లీటర్లు పిచికారి చేయాలి.రబీ సీజన్ లో వరి పంట కాకుండా ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు.అలాగే ఎరువులు మరియు పురుగు మందులు అధిక మోతాదు వాడకూడదని,సిఫార్సు చేసిన మోతాదు మేరకే వాడాలని రైతులకు సూచించారు.రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయి




అన్నారు,కార్యక్రమంలో ఆత్మ బి టి ఎం హరిబాబు,వ్యవసాయ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

## వరదలలో సర్వం కోల్పోయిన వృద్ధ దంపతులకు ?58,630/- ఆర్థిక సహాయం అందజేసిన ఆల్ మేవా, సలీం నగర్ పీస్ ఫౌండేషన్, నంద్యాల ముస్లిం జేఏసీ.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.:

ఇటీవల చామకాలువ కు వచ్చిన వరదలలో సర్వం కోల్పోయిన హుస్సేన్ బి, షఫీ వృద్ధ దంపతులకు ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్లౌడ్ ఫండింగ్ ద్వారా వసూలైన ?30,500/-, మరియు సలీం నగర్ పీస్ ఫౌండేషన్, నంద్యాల ముస్లిం జేఏసీ ల ఆధ్వర్యంలో వివిధ మసీదులలో వసూలైన ?28,130 వెరసి ? 58,630/- లను ఈరోజు ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షుడు ఇంజనీర్ ఇమ్రాన్ పాషా, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్ ఎండి అబులైస్,జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్, సలీంనగర్ పీస్ ఫౌండేషన్ అధ్యక్షులు సమీవుల్లా ఖాన్, వైఎస్ ప్రెసిడెంట్ నూర్, ముస్లిం జేఏసీ సలహాదారు అతావుల్లా ఖాన్ ల ఆధ్వర్యం లో వృద్ధ దంపతుల చేతికివ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వృద్ధ దంపతులకు, మరియు ఈ ప్రాంత వాసులకు ప్రభుత్వం నుండి ఇప్పటివరకు ఎలాంటి



సహాయం అందలేదు, కాబట్టి నంద్యాల ఎమ్మార్వో ప్రభుత్వ సహాయం అందించి వారికి కొత్తగా ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# టిడిఆర్‌ల జారీ వేగవంతం

- పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలి
- నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :**

నగరంలోని కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు చేపట్టనున్న రహదారి విస్తరణ పనులకు సంబంధించి టిడిఆర్ బాండ్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉస్మానియా కళాశాల, వడ్డేగేరి ప్రాంతాల్లో రహదారుల విస్తరణకు సంబంధించిన కొలతలను కమిషనర్ పరిశీలించారు. నగరాభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ప్రధాన రహదారుల విస్తరణ పనులు ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రారంభించాల్సిన అవసరం ఉందని, ఇందుకు టిడిఆర్ బాండ్ల మంజూరులో పారదర్శకత, వేగం తప్పనిసరిగా




ఉండాలని సూచించారు. రహదారి విస్తరణ వల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు నగరవాసులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఆస్తి యజమానులకు టిడిఆర్ బాండ్ల జారీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు తలెత్తకుండా అన్ని నిబంధనలను పాటిస్తూ పూర్తి పారదర్శకతతో చర్యలు తీసుకోవాలని అధికారులను



ఆదేశించారు. రహదారి విస్తరణ పనులు నగర అభివృద్ధికి కీలకమని, ఇతర శాఖలతో సమన్వయంతో పని చేసి టిడిఆర్ బాండ్ల జారీని త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, బిల్డింగ్ ఇంస్పెక్టర్లు వేమన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలి

### -జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**


జిల్లాలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను పూర్తిస్థాయిలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని , అదే విధంగా భూములకు సంబంధించిన మ్యుటేషన్ దరఖాస్తులను పెండింగ్ ఉండకుండా సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రీ సర్వే, మ్యుటేషన్ తదితర అంశాల పై జాయింట్ కలెక్టర్ ఆర్డీవోలతో, తహసిల్దార్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు..

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే పైలట్ ప్రాజెక్ట్ మొదటి దశలో జిల్లాలో ఎంపికైన 25 గ్రామాల్లో క్లరికల్ సవరణలను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నిర్ణీత కాలవ్యవధి లోపు పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు.

రెండవ దశలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన 24 గ్రామాల్లో మ్యుటేషన్ ప్రక్రియను పూర్తిచేసి, ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మ్యుటేషన్‌లో పెండింగ్ లేకుండా ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి తుది ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.

మూడవ దశలో ప్రారంభమైన 32 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియలో భాగంగా జీ.టి (గ్రౌండ్ ట్రూతింగ్) పూర్తిచేయడం తదితర ప్రక్రియలను ప్రభుత్వం నిర్ణయించిన గడువు




లోపల పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత తహశీల్దార్లు, ఆర్డీవోలను ఆదేశించారు.

రీ%-%సర్వే, మ్యుటేషన్ ప్రక్రియల పురోగతిపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, తరచుగా తనిఖీలు నిర్వహించి నివేదికలను అందజేయాలని జేసీ ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియ ప్రజల భూమి హక్కులకు అత్యంత కీలకమని, అందువల్ల ప్రతి దశను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, ఫలితాలు సాధించాలని సూచించారు.. ఎక్కడైనా నిర్లక్ష్యం, ఆలస్యం లేదా తప్పిదాలు చోటుచేసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి రీ సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ, ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి సారించండి



-జొహరపురంలో పర్యటించిన కమిషనర్ పి.విశ్వనాథ్
- ఇద్దరు సానిటేషన్ కార్యదర్శులపై చర్యల ఆదేశం
- పారిశుద్ధ్య, ట్యాబ్ ఇంస్పెక్టర్ల పనితీరుపై అసహనం
- ఖాళీ స్థలాలకు నోటీసులు జారీ చేయండి

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో

నగరపాలక అధికారులు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. ప్రజల సమస్యలు కార్యాలయాల్లో కూర్చుని కాదు, క్షేత్రస్థాయిలోకి వెళ్లినప్పుడే స్పష్టంగా అర్థమవుతాయని తెలిపారు. మంగళవారం జొహరపురం ప్రాంతంలో ఆయన వివిధ కాలనీల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా పరిస్థితులను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో చెత్త సకాలంలో తొలగించకపోవడం, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం కనిపించడంతో ఇద్దరు సానిటేషన్ కార్యదర్శులపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్ ఇంస్పెక్టర్ పనితీరుపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. పూడికతీత పనులు ఎందుకు చేపట్టాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

అలాగే ఒకచోట తాగునీటి పైప్‌లైన్ నుండి డ్రైనేజీ కాలువలోకి కొళాయి ఉండగా, మరోచోట లీకేజీ ఉన్నట్లు గుర్తించి ట్యాబ్ ఇంస్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి నిర్లక్ష్యం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని హెచ్చరించారు. ఖాళీ స్థలాలను గుర్తించినప్పుడు నోటీసులు జారీ చేయడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు.

అదేవిధంగా మునగాలపాడు సమ్మర్ స్టోరీస్ ట్యాంకు వద్ద 130 ఎకరాల భూమిని పరిశీలించారు. స్థల సర్వే, అభివృద్ధి, ఆహ్లాదకరమైన, వినోద వాతావరణ వసతుల కల్పనకు ప్రతిపాదనలపై చర్చించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత, తాగునీటి నాణ్యత అంశాల్లో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, డిఈఈ నరేష్, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా కల్చర్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం.

## -రైతుల ఆదాయం పెంపే లక్ష్యం : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.





పల్లె వెలుగు అమరావతి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఆక్వా రంగం కీలకమైన ఆధారంగా మారిందని, ఆక్వా కల్చర్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం కృష్ణా జిల్లా పెనమలూరులోని మత్స్య శాఖ కార్యాలయంలో రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి అధికార సంస్థ పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్ ల వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులు ఆక్వా రైతులపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, వాటిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటోందన్నారు. దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రొయ్యలకు ఉన్న నాణ్యత, విశ్వసనీయతపై విస్తృత ప్రచారం అవసరమని, కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతుల పెంపు, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. నాణ్యతపై ప్రతి రైతు దృష్టి పెట్టాలని, అప్పుడే మంచి ధర లభిస్తుందన్నారు. దేశ మత్స్యరంగంలో ఆంధ్రప్రదేశ్ వాటా 29 శాతం ఉందని తెలిపారు. చేపలు, రొయ్యల చెరువులకు సర్వే నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలని సీఎం సూచించారని, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 48 శాతం చెరువుల రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. గతంలో రైతులు చెరువుల రిజిస్ట్రేషన్ విషయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించామని, చెరువులకు జియో ట్యాగింగ్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఆక్వారంగ సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఆక్వా రైతులకు రూ.800 కోట్ల విద్యుత్ రాయితీ అందించామని, దీన్ని రూ.1,200 కోట్లకు పెంచుతున్నామని, రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే విద్యుత్ రాయితీ వర్తిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

### బీసీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ వైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని, కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు సహా డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బలహీన వర్గాల ఎదుగుదల తెలుగుదేశం పార్టీ పాలనలోనే సాధ్యమైందని అన్నారు. గతంలో కులాల వారీగా వారి వృత్తుల ఆధారంగా పరికరాలు అందించి అభివృద్ధికి దోహదం చేశామని, 2019 తర్వాత వచ్చిన ప్రభుత్వం అనగారిన వర్గాల అభ్యున్నతిని పక్కనపెట్టిందని విమర్శించారు. కేవలం గొప్పలు చెప్పుకునేందుకు 54 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు నాయుడు బీసీల అభ్యున్నతికి ఆహర్నిశలు శ్రమిస్తున్నారని, జనాభా దామాషా ప్రకారం ప్రతి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి వర్గాల అభివృద్ధికి వినియోగిస్తామని హామీ ఇచ్చారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే బీసీలకు ఎక్కువగా ఉద్యోగాలు, మెడికల్ సీట్లు లభించాయని గుర్తు చేశారు. వైశ్యులను ఓబీసీలో చేర్చే అంశంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని, ఈ విషయమై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రధానితో కూడా చర్చించారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# ఆళ్లగడ్డలో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం.

## -ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్ సామర్థ్యం పెంపు అవసరం. జిల్లా కలెక్టర్ జి.





రాజకుమారి.పల్లె వెలుగు ఆళ్లగడ్డ.

ప్రజా ఆరోగ్య శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఆళ్లగడ్డ పట్టణంలో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలో ఆరు కోట్ల రూపాయలతో అధునాతన వైద్య పరికరాలతో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక శాసనసభ్యులు భూమా అఖిలప్రియతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 6 కోట్ల రూపాయలతో అధునాతన వైద్య పరికరాలతో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించామని... రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను సూచించారు. ఈ సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా సుమారు 11 స్పెషలైజేషన్‌లకు సంబంధించిన వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. గతంలో కూడా ఈ ఆసుపత్రిలో నెలకు సుమారు 80 నుంచి 100 వరకు ప్రసవాలు జరిగేవని, ముఖ్యంగా సాధారణ కాన్పులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్సీలు), 19 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్సీలు), 11 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 2 ఏరియా ఆసుపత్రులు ప్రజలకు సేవలందిస్తున్నాయని తెలిపారు. ఆధునిక జీవనశైలి కారణంగా అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్ కెపాసిటీ పెంపు అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని, అందుకు అనుగుణంగా వైద్య సదుపాయాలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె స్పష్టం చేశారు. అనంతరం ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

## కె కె ఆర్ రాక్స్ టీమ్ కు. ,,,, సుమలమోహన్ క్రికెట్ డ్రెస్ ,,,,



ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 16,

ఎమ్మిగనూరు మండలంలో కలుగొట్ల గ్రామ నాయకులు ఎస్సీ సెల్ అధ్యక్షులు సుమాల మోహన్ బీవీ క్రికెట్ టోర్నమెంట్ కొరకు కలుగొట్ల కేకే,ఆర్ రాక్స్ టీమ్ కి డ్రెస్ స్పాన్సర్ చేయడం జరిగింది.అందుకుగాను రాక్స్ టీమ్ సుమాల మోహన్ ను టిడిపి గ్రామ యువ నాయకులు సుమల సురేష్ సన్మానించి,కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలొ రాక్స్ టీమ్ సభ్యులు పవన్,దిలీప్,పౌలు,అజయ్,భరత్,నాగరాజ్,మ్యాక్స్ వెల్,యేసు,దివాకర్ మరియు టీడీపీ గ్రామ ఆర్గనైజర్ సురేష్ పాల్గొన్నారు.



# పంట నమోదు చేసుకోవాలి..





మహానంది, పల్లె వెలుగు

ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో రబీ 2025 కు సంబంధించి పంట నమోదు చేస్తున్నామని, రైతులు సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బందిని కలిసి తాము వేసిన పంటలను పంట నమోదు చేయించుకోవాలన్నారు. కౌలు రైతులు వెంటనే రైతు సేవ కేంద్రాల సిబ్బంది, వీఆర్వో ను కలిసి సిసిఆర్సి కార్డ్స్ తీసుకోవాలన్నారు. రైతులు అజటోబాక్టర్, ఆజోస్పిరిల్లం, అజోల్లా , ఫాస్ఫరస్ సాల్యుబలైజింగ్ బ్యాక్టీరియా వంటి జీవన ఎరువులను అధికంగా వాడి యూరియా ఎరువులను తగ్గించుకోవాలని తెలిపారు. భూమిలో కర్బన శాతం, సూక్ష్మజీవుల సంఖ్యను పెంచుకోవడం ద్వారా నేలను సారవంతం చేసుకోవచ్చని తెలియజేశారు.వరిలో పైపాటుగా భాస్వరం ఎరువులు వాడరాదన్నారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్ పెండింగ్ ఉన్న రైతులు వెంటనే చేయించుకోవాలని, భవిష్యత్తులో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు మాత్రమే వ్యవసాయ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామ ఉద్యాన అధికారి విశ్వద, పశు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఆదోని జిల్లా సాధన కోసం మరో ముందడుగు.



కూటమి నాయకులతో ఆదోని జిల్లా సాధన జేఏసీ నాయకులు భేటీ.

**ఆదోని పల్లె వెలుగు డిసెంబర్ 16**

ఆదోని జిల్లా కోసం మరో ముందడుగు. కూటమి ప్రభుత్వ ముఖ్య నాయకులతో జేఏసి భేటి. మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఇంట్లో తెలుగుదేశం పార్టీ కర్నూల్ జిల్లా అధ్యక్షులు తిక్కా రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే పార్థ సారథి తో ఆదోని జిల్లా ఏర్పాటు పై జేఏసి నాయకులు రఘురామయ్య, అశోకానందరెడ్డి, నూర్ అహ్మద్, లలిత, వీరేష్, కోదండ, కృష్ణ మూర్తి గౌడ్, దస్తగిరి నాయుడు చర్చించారు. ఆదోని జిల్లా ఏర్పాటు అయ్యేవరకు పోరాటం ఆగదని స్పష్టం చేసిన జేఏసి. ఖచ్చితంగా ముఖ్యమంత్రి తో చర్చించి ఆదోని జిల్లా ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్న కూటమి పెద్దలు.

## మహాలక్ష్మి ట్రేడర్ నందు.1.26 లక్షలు,,,,




**ఎరువులు అమ్మకాలు నిలుపుదల...,,,,**

**ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 16**

ఎమ్మిగనూరు,ఎరువుల దుకాణం తనిఖీల్లో భాగంగా అంబేద్కర్ సర్కిల్ లో ఉన్న మహాలక్ష్మి ట్రేడర్స్ నందు 1.26 లక్షలు విలువలు చేసే ఎరువులు "%ూా%" ఫామ్ ఇన్మ్లాడింగ్ చేయకుండా బిజినెస్ చేస్తునందుకు గాను అమ్మకాలు నిలుపుదల చేయడ మయినది మరియు గోడౌన్ నందు ఎక్స్పైర్డ్ అయిన పురుగు మందులను పరిశీలించి వాటిని వెంటనే డిస్పోస్ చేయాలని వాటిని రైతులకు విక్రయించ కూడదని ఆదేశించడమైనది.ఇందువెంట,వ్యవసాయ విస్తరణ అధికారి నరసింహులు పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు పునాది

**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 16:**



బాల్యం నుండే విద్యార్థులు తమ భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని నంద్యాల జిల్లా మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఈశ్వర వరప్రసాదరావు పేర్కొన్నారు. మంగళవారం బండి ఆత్మకూరులోని కేజీవీపీ పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి యశోద ప్రిన్సిపల్ దాక్షాయని ఇలా నేతృత్వంలో విద్యార్థుల భవిష్యత్తుపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. విద్యార్థులు సాంకేతికను అందిపుచ్చుకొని ఉన్నతమైన భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని అన్నారు. కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. రాబోవు విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలను సాధించి పాఠశాల కు మంచి పేరు తీసుకుని రావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ అంటే శాంతి, కరుణ, ప్రేమ



**మహానంది, పల్లె వెలుగు**

క్రిస్మస్ అంటే శాంతి, కరుణ, ప్రేమ సందేశాలను సమాజానికి చాటి చెప్పే పవిత్ర పండుగ అని తిమ్మాపురం ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భగవాన్ దాస్ పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ముందస్తుగా క్రిస్మస్ పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి, శాంతి సందేశాలను పలువురు వినిపించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శారదాబాయి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ వేణు, పిహెచ్ఎన్ అమినాబి,ఎం పి హెచ్ ఈ ఓ హుస్సేన్ రెడ్డి,ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాట్ ను ప్రారంభించిన: మండల టిడిపి నాయకులు

ప్రతి ఇంటికి సురక్షితమైన నీరు అందించడమే లక్ష్యం .....
టిడిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మగతి ఈరన్న గౌడ్

**నందవరం, పల్లె వెలుగు డిసెంబర్ 16**

నందవరం మండల పరిధిలోని ముగతి గ్రామంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ఆదేశాలు మేరకు బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్ ఆధ్వర్యంలో ఎంపిడిఓ పుల్లయ్య,మండల నాయకులు రైస్ మిల్ నారాయణ రెడ్డి,గజేంద్ర రెడ్డి,బ్రహ్మానంద రెడ్డి,ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో తాగునీటి సౌకర్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చెబుతుందని అందులో భాగంగా ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని గ్రామాల్లో ఏర్పాటుచేసి గ్రామీణ ప్రజలకు మినరల్ వాటర్ ను అందిస్తుందని గ్రామాల అభివృద్ధి కూటమి



ప్రభుత్వం తోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నందవరం ఎంపీడీఓ కృష్ణమూర్తి,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ బాలకృష్ణ ,పంచాయితీ సెక్రెటరీ రవి,కృష్ణమూర్తి,టీడీపీ నాయకులు రైస్ మిల్ నారాయణరెడ్డి,చిన్న రాముడు,ముగతి భార్గవ్ యాదవ్,రామకృష్ణారెడ్డి,జగాపురం నరసింహులు, ఘట్టాల రంగన్న,బాపురం శ్రీను,ఎల్ఐసి గోపాల్,



ముగతి గ్రామ అధ్యక్షులు గుగ్గిరి నరసింహులు,హాలహర్వి గ్రామ అధ్యక్షులు ఎర్రన్న, కాపు వీరారెడ్డి,కొండారెడ్డి,బాలరాజ్,ధర్మారెడ్డి, వీరారెడ్డి,సోమశంకర్ రెడ్డి,ఈడిగ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ కడబూరి, ఈ.నవీన్ అర్జున్,యాదవ్,ఈడిగ ఆటో రవి,బోయ ఈరన్న, హుస్సేనయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాక్టరీ బస్సు ఢీకొని మాజీ ఎల్ఐసీ ఏజెంట్ దుర్మరణం

- వెనుక నుంచి ఢీకొట్టిన జయరాజ్ స్టీల్స్ బస్సు.. నుజ్జునుజ్జయిన తల
- రాజ్‌విహార్ - కలెక్టరేట్ రోడ్డులో ఘటన
- మృతుడికి భార్య, కుమారుడు

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

నడిరోడ్డుపై అతివేగంగా వచ్చిన ఫ్యాక్టరీ బస్సు ఓ ద్విచక్ర వాహనదారుడిని బలిగొంది. బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో వ్యక్తి తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాద ఘటన మంగళవారం సాయంత్రం కర్నూలు నగర నడిబొడ్డున చోటుచేసుకుంది.

ట్రాఫిక్ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలులోని మెడికల్ కాలేజ్ పోస్ట్ పరిధిలోని సంజయ్ గాంధీ నగర్‌కు చెందిన సూర్యపోగు మదన్ కుమార్ (35) గతంలో ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేసేవారు. ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నారు. ఇతనికి భార్య ఝాన్సీ, ఒక కుమారుడు ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో సర్వీసింగ్‌కు ఇచ్చిన తన బైక్‌ను తీసుకురావడానికి





మదన్ కుమార్ ఇంటి నుంచి బయలుదేరారు.

బైక్ (%ూా39ఌ=%-2638) తీసుకుని రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వైపు వెళ్తుండగా.. సాయంత్రం 4:45 గంటల సమయంలో లక్ష్మీ నివాస్ లాడ్జ్ పక్కన ఉన్న వెంకటేశ్వర హాట్ చిప్స్ షాపు సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన జయరాజ్ స్టీల్ కంపెనీకి చెందిన బస్సు (%ూా39ఔూ%-5220) అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మదన్ కుమార్ కిందపడిపోగా, బస్సు చక్రాలు తలపై నుంచి వెళ్లడంతో తల నుజ్జునుజ్జయి




అక్కడికక్కడే మృతి చెందారు.

అటుగా వెళ్తున్న పులింద్ర అనే వ్యక్తి మృతుడిని గుర్తించి భార్య ఝాన్సీకి సమాచారం అందించారు. ఆమె హుటాహుటిన ఆసుపత్రికి చేరుకోగా.. అప్పటికే మదన్ కుమార్ మృతి చెందినట్లు క్యాజువాలిటీ వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఝాన్సీ ఫిర్యాదు మేరకు కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో భార్య, కుమారుడు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కండి.

జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్.

**-పల్లె వెలుగు నంద్యాల రూరల్.**

దేశంలోని రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ప్రజలకు కార్మికులకు అవసరమైన విధానాలు చేపట్టకుండా పెట్టుబడిదారులకు కాపాడ సంస్థలకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటూ ఉన్నాయని వీటి పైన రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఎం. నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు, వి ఏసురత్నం, టి రామచంద్రుడు, నరసింహ నాయక్ లతోపాటు జిల్లా కమిటీ సభ్యులు రణధీర్, రత్నమయ్య, నరసింహులు లక్ష్మణ్, వెన్న బాల వెంకట్, సుధాకర్, ఎం ఆర్ నాయక్, మధు శేఖర్ లు పాల్గొన్నారు.అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం బ్రిటిష్ కాలం నాటి నుండి ఉన్న 44 కార్మిక చట్టాలను కుదింపు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా చేసి పెట్టుబడిదారులకు కార్పొరేట్




సంస్థలకు కార్మికులను నయా బానిసలుగా చేసిందని అదేవిధంగా ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని విధానం అమలవుతుంటే మనదేశంలో 13 గంటల పాటు పనిచేయాలని నిబంధనను తీసుకురావడం చాలా దుర్మార్గమని అదేవిధంగా యూపీఏ ప్రభుత్వ హాయంలో వామపక్షాల పోరాటంతో వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని స్కీముగా మార్చి నిధులను తగ్గించుకునే కృషిని చేస్తుందని అన్నారు మోడీ ప్రభుత్వం అధికారంలోకిచ్చిన 12 సంవత్సరాల కాలంలో ప్రజల అవసరమైనటువంటి విధానాలు చేపట్టలేదని ముఖ్యంగా రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు సరుకుల ధరలను అదుపు చేయడంలో విఫలమయ్యారని పెట్రోలు డీజిల్ వంటగ్యాస్ ధరల ఆకాశంలో ఉంచేలా పాలన సాగిందని ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దేశద్రోహులుగా ముద్ర వేసి రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధానాలను అనుసరిస్తూ రాజ్యాంగ హక్కులను కాల రాస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను పోరాటానికి సిద్ధం చేయాలని అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి కేవలం పెన్షన్ పథకం ఉచిత బస్సు పథకాలను అమలు చేసి మిగిలిన వాటిని తుంగలో తొక్కి అన్ని నెరవేర్చాము ఎవరైనా నెరవేర్చలేదని మాట్లాడితే వారిపైన కేసులు పెడతాము అని బెదిరింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమని ఈ దుర్మార్గమైన విధానాలకు వ్యతిరేకంగా రాబోయే కాలంలో ప్రజలను, కార్మికులను సమీకరించి రాజలేని పోరాటాలను నిర్వహించాలని, సిపిఎం పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు.

# విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజలకు భరోసా

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరిక

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతే లక్ష్యంగా 'విజిబుల్ పోలీసింగ్' వ్యవస్థను బలోపేతం చేయాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, నేర నియంత్రణే ధ్యేయంగా పనిచేయాలన్నారు.

ముమ్మర తనిఖీలు:

అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా



తనిఖీ చేయాలని, ముఖ్యంగా గంజాయి, నిషేధిత వస్తువుల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి:

రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ల డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత:

సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులను క్లిక్ చేయడం, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు షేర్ చేయడం వంటివి చేయరాదని సూచించారు. అత్యవసర సమయాల్లో లేదా సమస్యలు తలెత్తితే స్థానిక పోలీసులకు గానీ, డయల్ 100, 112 నంబర్లకు గానీ సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

## మంగళగిరి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన 'పబ్లిక్ గ్రీవెన్స్' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్.



**పల్లె వెలుగు మంగళగిరి.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎండీ. ఫరూక్ ఆధ్వర్యంలో ఈ రోజు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) కేంద్ర కార్యాలయంలో 'పబ్లిక్ గ్రీవెన్స్' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ప్రజల నుండి అందిన వివిధ రకాల సమస్యలు, వినతులను మంత్రి ఫరూక్ సావధానంగా ఆలకించారు. ప్రభుత్వ పథకాలు, పరిపాలనా అంశాలు, వ్యక్తిగత సమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి, వాటి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, వాటిని వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా సామాన్య ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య మరింత పారదర్శకమైన వారధిని నిర్మించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావడానికి పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య న్యాయవాదుల సంఘం కన్వీనర్ గంగిశెట్టి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## విద్యాశాఖ అధికారి జానర్దన్ రెడ్డి కి ముఖ్యమైన అంశాలపై వినతిపత్రం.



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

నంద్యాల జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఈ రోజు రూట నంద్యాల టీమ్ ప్రతినిధులు గౌరవనీయులైన జిల్లా విద్యాశాఖ అధికారి జానర్ధన్ రెడ్డి ని కలిసి పలు ముఖ్యమైన అంశాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రధానంగా క్రింది మూడు అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు: ఉర్దూ కాంప్లెక్స్ సమస్య ఉర్దూ విద్యకు సంబంధించిన సదుపాయాలను మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అకాడమిక్ ఇన్‌స్ట్రక్షన్ (%ూఝుఎవఎఅఎ ×అరతీబవ్లీఅశీఅ%) ఫారమ్‌ల భర్తీ సమస్య %-% ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి సరైన మార్గదర్శకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎ ఎ ఎం ఓ రిక్రూట్‌మెంట్ సమస్య %-% భర్తీ ప్రక్రియను వేగవంతం చేసి న్యాయంగా పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రూట నంద్యాల టీమ్ తరఫున గౌరవనీయ నాయకులు మోమిన్ సైఫుల్లా, దస్తగిరి బాషా, జానీ బాషా, అబ్జల్ బాషా, యూనుస్ సర్, మరియు గౌరవనీయ ఉర్దూ డిఐ హష్మద్దీన్ సర్ పాల్గొన్నారు. గౌరవనీయ డి ఈ ఓ ఈ అంశాలపై సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## అంజయ్య యాదవ్ కు ఘనంగా సన్మానం



**డిసెంబర్ 16, న్యూస్/నవాబుపేట్ మండలం:**

124 అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఛత్రపతి శివాజీ నగర్ కాలనీకి చెందిన అంజయ్య యాదవ్ ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికలలో వికారాబాద్ జిల్లా, నవాబుపేట్ మండలం, కడిచర్ల గ్రామ పంచాయితీ నుండి పోటీ చేసి సర్పంచ్ గా విజయం సాధించిన సందర్భంగా శేరిలింగంపల్లి శాసనసభ్యుడు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ. అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి అంజయ్య యాదవ్ ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మరెళ్ల శ్రీనివాస్, నాగరాజు, రమణారెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోండి టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్.

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నంద్యాలలో డిశంబర్ 23 వ తేదీ స్థానిక నేషనల్ డిగ్రీ కాలేజీ నందు ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ తెలిపారు .

ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ ను డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి , నేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్ వేణు, మస్తాన్ వలి , శ్రీనివాసులు, టీడీపీ నాయకులు షేక్ మొహమ్మద్



రఫీ (మున్నా), జైలాన్, గోవింద నాయుడు, నాగరాజు, మున్నా తో కలిసి టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ రిలీజ్ చేశారు .

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ మరియు చుట్టుపక్కల ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు . 20 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొనబోతున్నాయని . దాదాపు 1890 కి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు . నిరుద్యోగులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని ప్రతి నెల జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు . 20 లక్షల ఉద్యోగాలు ఐదు సంవత్సరాలలో ఇవ్వాలనేదే తెలుగుదేశం పార్టీ ఆశయమన్నారు . ఈ ఆశయానికి అనుగుణంగా మంత్రివర్యులు నారా లోకేష్ గారు సారథ్యంలో ఖచ్చితంగా సాధిస్తామని ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు అలాగే నాకు తెలిసిన హైదరాబాద్ కంపెనీస్ కూడా నంద్యాలకు తీసుకుని వచ్చి జాబ్ మేళా నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

## గుండెపోటుతో సింగల్‌రెడ్డి నరసింహారెడ్డి మృతి కుటుంబాన్ని పరామర్శించిన పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

**పోరుమామిళ్ల, డిసెంబర్ 16 ( పల్లె వెలుగు)**

పోరుమామిళ్ల మండలం, పోరుమామిళ్ల గ్రామానికి చెందిన ప్రముఖుడు సింగల్‌రెడ్డి నరసింహారెడ్డి (బ్రాందీ షాప్ నరసింహారెడ్డి) గారు ఈరోజు ఉదయం 8:30 గంటలకు గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించారు. ఆయన మృతి వార్త గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

ఈ విషయం తెలిసిన వెంటనే మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి నరసింహారెడ్డి నివాసానికి చేరుకుని, వారి పార్థివ దేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

శ్రద్ధాంజలి ఘటించిన వారిలో చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, జెడ్పిటిసి ముత్యాల ప్రసాద్, మండల



ఉపాధ్యక్షులు సి. భాష, నేలటూరి జయరాం రెడ్డి, వడ్డమాను రాజారెడ్డి, చపాటి నారాయణరెడ్డి, సురేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పోతిరెడ్డి నాగార్జున రెడ్డి మాట్లాడుతూ, "గత 40 సంవత్సరాలుగా బ్రాందీ షాప్ నరసింహారెడ్డి అంటే తెలియని వారు లేరు. సౌమ్య స్వభావంతో అందరికి చేరువై మంచి పేరు సంపాదించుకున్నారు. ఇలా హఠాత్తుగా ఆయన మృతి చెందడం చాలా బాధాకరం. ఆయన మా కుటుంబానికి పూర్వం నుంచే బంధువు, నాకు వరుసకు చిన్నాన్న అవుతారు" అని తెలిపారు.

నరసింహారెడ్డి కి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఒక కుమారుడు మరియు కుమార్తె ముంబైలో ఉండగా, మరో కుమారుడు విదేశాల్లో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే పార్టీలకు, కులమతాలకు అతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి నరసింహారెడ్డి గారి భౌతిక కాయాన్ని దర్శించి నివాళులర్పిస్తున్నారు. గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి : సిపిఐ

### మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ పై18 న కడప కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేద్దాం

**బద్వేల్ డిసెంబర్ 16 (పల్లె వెలుగు)**

పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం. సిపిఐ

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ఆపాలని గురువారం కడప కలెక్టరేట్ ధర్నాకు ప్రజలందరూ సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ లు ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బద్వేల్ పట్టణంలో జేవీ భవనం నందు విలేకరుల సమావేశంలో సిపిఐ నాయకులు మాట్లాడుతూ

రాష్ట్రవ్యాప్తంగా విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను తాము అధికారంలోకి వస్తే తక్షణమే పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేద విద్యార్థుల కష్టాలు తీరుస్తామని చెప్పిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పటికి ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని కూటమి ప్రభుత్వం పై మండిపడ్డారు. గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మెడికల్ కళాశాలలో సీట్లను కేటగిరీలుగా విభజించి అమ్ముకుందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యాశాఖ




మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు మండిపడ్డారు. కానీ నేడు మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత 100% మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తున్నారని, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్నది ఎన్డీఏ ప్రభుత్వమని పేర్కొన్నారు.

అదేవిధంగా తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే జీవో నెంబర్ 107,108 రద్దు చేసి మెడికల్ విద్యను పూర్తిగా ప్రభుత్వ పరం చేస్తామని చెప్పి, నాడు మాత్రం మేము పిపిపి విధానంలోనే నడిపిస్తామని చెప్పి విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసగిస్తున్నారు అని అన్నారు. ఇది ఇలానే కొనసాగిస్తే కూటమి ప్రభుత్వం చేస్తుండడం సిగ్గుచేటని అన్నారు. కాబట్టితక్షణమే మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ను ఆపాలని హెచ్చరించారు. అదేవిధంగా ఈనెల 18వ తేదీన గురువారం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి విద్యార్థులు, ప్రజలు,పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలనికోరారు . ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా సహాయ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేలు, పివి రమణ , పడిగే వెంకటరమణ, విద్యార్థి సంఘం నాయకులు ప్రశాంత్, వెంకటరమణ, ప్రవీణ్ కుమార్, జగన్, చందు తదితరులు పాల్గొన్నారు

## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై మరియు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం.

**గడివేముల డిసెంబర్ 16 పల్లె వెలుగుగు దిన పత్రిక..**

నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం స్థానిక గడివేముల పరిధిలోని మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో వాసుదేవగుప్త ఆధ్వర్యంలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని ట్రైన్డ్ పెసరవాయి గ్రామ పంచాయతీ సెక్రెటరీ, గడిగరేవుల డిజిటల్ అసిస్టెంట్ మరియు కరిమద్దెల వెల్ఫేర్ అసిస్టెంట్లు పంచాయతీ సెక్రెటరీలకు, సచివాలయం సిబ్బందికి, మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యుల అందరిపై సమగ్ర సర్వే నిర్వహించాలని అవగాహన కల్పించారు. బఈ సమావేశంలో





వారు మాట్లాడుతూ అంటే పిల్లల హక్కులు (విద్య, ఆరోగ్యం, రక్షణ, అభివృద్ధి) గురించి, వారిపై జరిగే నేరాలు (బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక దాడులు) మరియు వాటిని నివారించడానికి ఉన్న చట్టాలు (పోక్సో, బాలల హక్కుల చట్టం) గురించి ప్రజలకు తెలియజేసే కార్యక్రమంబీ ముఖ్యంగా 1098 హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రచారం చేయడం దీని ప్రధాన లక్ష్యం, దీని ద్వారా పిల్లలను రక్షించడం అందరి సామాజిక బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవ గుప్తా, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ సెక్రెటరీలు, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# సంక్రాంతి సీజన్... రైళ్లన్నీ దాదాపు ఫుల్!

సంక్రాంతి పండుగకు నెల ముందే ఫుల్ అయిన రైళ్లు
భారీగా వెయిటింగ్ లిస్ట్.. కొన్ని రైళ్లలో 'రిగ్రెట్' బోర్డులు
విశాఖ, ఉత్తరాంధ్ర వెళ్లేవారికి తీవ్ర నిరాశ
ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్న ప్రయాణికులు

సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లాలనుకునేవారికి రైల్వే శాఖ నుంచి నిరాశ తప్పలేదు. పండుగకు నెల రోజుల సమయం ఉండగానే ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే రైళ్లలో బెర్తులన్నీ నిండిపోయాయి. ప్రస్తుతం ఏ రైలులో రిజర్వేషన్ కోసం ప్రయత్నించినా భారీ వెయిటింగ్ లిస్ట్ కనిపిస్తోంది. కొన్ని రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ కూడా దాటిపోయి 'రిగ్రెట్' అని చూపిస్తుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఉద్యోగ, వ్యాపారాల హడావిడిలో ముందుగా టికెట్లు బుక్ చేసుకోలేకపోయిన వారు ఇప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విశాఖపట్నం, ఉత్తరాంధ్ర జిల్లాలకు వెళ్లే ప్రయాణికుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దాదాపు 12 గంటల సుదూర ప్రయాణం కావడంతో ఎక్కువ మంది రైళ్లకు ప్రాధాన్యతనిస్తారు. అయితే రెండు నెలల క్రితమే సాధారణ, ప్రత్యేక రైళ్లలో రిజర్వేషన్లు పూర్తయినట్లు తెలుస్తోంది. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి పునరావృతం అవుతుండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రైళ్లలో బెర్తులు దొరకని కారణంగా చాలామంది బస్సులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూడాల్సి వస్తోంది.

## ✓వన్ కల్యాణ్‌ను కలిసిన యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంగళవారం నాడు విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా వివిధ రంగాల్లో సహకారం, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఇరువురు తమ ఆలోచనలను పంచుకున్నారు. పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరంపై చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో లారా విలియమ్స్‌తో పాటు యూఎస్ ఎంబసీకి చెందిన మెరెడిత్ మెట్జలర్, పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్ అబ్దుల్ రెహ్మాన్ హబీబ్, పొలిటికల్ స్పెషలిస్ట్ శ్రీమాలి కారి, ఎకనమిక్ స్పెషలిస్ట్ శిబా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 28వ హిందూ సమ్మేళనం మహాసభకు,,,,

బిజెపి నాయకులు దేశాయ్ గురు రాజ్,,,,,,

నందవరం పల్లె వెలుగు డిసెంబర్ 16



నందవరం మండలంలో నందవరం గ్రామంలో డిసెంబర్ 28వ జరుగుతున్న హిందు సమ్మేళనం మహా సభకు ఏర్పట్లగురించి గ్రామపెద్దలతో శ్రీ గ్రామ ఆంజనేయ స్వామి వారి గుడి అవరణలో సమవేశం ఏర్పాటు చేశారు
ఈ సమావేశానికి గురురాజ్ దేశాయ్ హాజరయ్యారు
ఆర్,ఎస్,ఎస్ సంఘు పెద్దలు కలిసి అందరూ సభను విజయవంతం చేయాలని వారు తెలిపారు




**60 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసి 6,014 ఉద్యోగాలిచ్చాం**

**రాష్ట్రంలోని మొత్తం 55 వేల కానిస్టేబుళ్లలో 24 వేలమందిని నేనే నియమించా..**

**డీఎస్సీతో 15,591 మందికి కొలువులిచ్చాం**

**కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం**

**20 లక్షల ఉద్యోగాల భర్తీ హామీకి కట్టుబడ్డాం**

**ట్రైనీ కానిస్టేబుళ్ల స్టైపెండ్ రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచుతున్నాం**

**సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాలు, డ్రగ్ మాఫియాపై క్రియాశీలకంగా పని చేయాలి: చంద్రబాబు**

**కొత్త కానిస్టేబుళ్లకు నియామకపత్రాల జారీ**

త్యాగాలకు మారుపేరు పోలీసు వ్యవస్థ. బయటకెళ్లిన వారు సురక్షితంగా తిరిగొస్తున్నారంటే అందుకు పోలీసు వ్యవస్థే కారణం. ఒకప్పుడు రాయలసీమలో ముఠా కక్షలు, గొడవలు ఉండేవి. హైదరాబాద్‌లో మత విద్వేషాలు ఉండేవి. గబ్బర్‌సింగ్ లాంటి ఒక పోలీసు అధికారితో వాటిని నియంత్రించాను. తీవ్రవాద సమస్యతోపాటు ప్రజలకు నష్టం కలిగించే ఏ వ్యవస్థనూ నేను ఉపేక్షించలేదు. అందుకే నామీద 24 క్లైమోర్ మైన్స్‌తో దాడి చేశారు. అయినా భయపడలేదు.

– సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రైనీ కానిస్టేబుళ్ల స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచుతున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. కొత్త కానిస్టేబుళ్లకు ఆయన అభినందనలు తెలిపారు. క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలను కాపాడాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లో జరిగిన కానిస్టేబుళ్లకు నియామకపత్రాలు అందజేసే కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. "మీకు ఉద్యోగాలివ్వకుండా రాజకీయ ప్రత్యర్థులు హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు 31 కేసులేశారు. అయినప్పటికీ రికార్డు సమయంలో పరీక్షలు నిర్వహించి 60 రోజుల్లో ఫలితాలు వెల్లడించి, ఎక్కడా రూపాయి లంచానికి తావు లేకుండా, సిఫారసులు లేకుండా 6,014 కానిస్టేబుల్ ఉద్యోగాలిచ్చాం. 3,343 మంది సివిల్ కానిస్టేబుళ్లు. 2,414 ఏపీఎసఈపీ, 993 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు. ఆర్టీసీలో 33 శాతం కండక్టర్లు మహిళలే ఉండాలనుకున్నాను. అది జరిగింది. ఆర్టీసీలో డ్రైవర్లుగా కూడా మహిళలు ఉండాలని కోరుకున్నా. అది నెరవేరలేదు. డ్రైవర్లుగా కూడా వస్తారని ఆశిస్తున్నా. 183 మంది గిరిజన పిల్లలు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. 1999 - 2004 లో 8,109 మందికి పోలీసు ఉద్యోగాలిచ్చా. 2014-19లో 9,464 మందికి, ఇప్పుడు 6,014 మందికి ఉద్యోగాలిచ్చాం. ఇలా మొత్తం 23,676 ఉద్యోగాలిచ్చాం. రాష్ట్రంలో 55,000 మంది కానిస్టేబుళ్లు ఉంటే, 24వేలమందికి నేనే ఉద్యోగాలిచ్చాను."అని చంద్రబాబు తెలిపారు. హోం మంత్రి అనిత, డీజీపీగా హరీశ్ కుమార్ గుప్తా రాష్ట్రంలో సమర్థవంతమైన పోలీసు వ్యవస్థకు శ్రీకారం చుట్టారని అభినందించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

### 20 లక్షల ఉద్యోగాలు కచ్చితంగా ఇస్తాం

"కూటమి మ్యానిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నాం. మెగా డీఎస్సీ ద్వారా 15,591 మందికి ఉద్యోగాలిచ్చాం. అన్ని శాఖల్లో 4,51,347 మందికి ఇప్పటికే ఇచ్చాం. ఇవి కాకుండా 197 పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలు...రూ. 8,55,170 కోట్ల పెట్టుబడులు... ఇవన్నీ పూర్తయితే కొత్తగా 8,23,922 మందికి ఉద్యోగాలొస్తాయి. విశాఖ భాగస్వామ్య సదస్సులో 538 ఎంవోయూలు చేశాం. 11 లక్షల 38,000 కోట్ల పెట్టుబడులు తెస్తున్నాం. వాటి ద్వారా 11 లక్షల 37,000 మందికి ఉద్యోగాలొస్తాయి. 735 పరిశ్రమలు వస్తాయి."

### గంజాయిని నియంత్రిస్తున్నాం

"రాష్ట్రంలో గంజాయి బ్యాచ్ వల్ల చెడ్డ పేరొస్తోంది. పిల్లల భవిష్యత్‌తో ఆడుకుంటున్నారు. ఏజెన్సీలో గంజాయి లేకుండా నివారిస్తున్నాం. ఎవరైనా రౌడీయిజం చేసేవారికి ఈ రాష్ట్రంలో ఉండే అర్హత లేదు. ఒకప్పుడు రౌడీలను రాష్ట్రం నుంచి బయటకు పంపేశాం. ఇప్పటికీ అదే నా పంథా. నేర స్వభావం ఉన్న వ్యక్తులపై కన్నేయాలి. నేరాలు జరిగిన వెంటనే వేగంగా స్పందించాలి. పాస్టర్ ప్రవీణ్ మృతిని ప్రభుత్వానికి అంటగట్టాలని కొన్ని దుష్టశక్తులు ప్రయత్నించాయి. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా ఆయన తాగి తూలుతూ, పడుతూ లేస్తూ రాజమండ్రి కెళ్లేముందు ప్రమాదవశాత్తూ చనిపోయారని పోలీసులు గుర్తించారు. గతంలో రాజకీయాల్లో నేరస్థులు ఉండేవారు కాదు. నేరస్థులకు మద్దతిచ్చేవారు కూడా కాదు. ఇప్పుడు రాజకీయ నేరస్థులకు అండదండలు దొరుకుతున్నాయి. ఎప్పుడూ లేని విధంగా గత ఐదేళ్లలో లేడీ డాన్లు కూడా తయారయ్యారు. మహిళల్లో రౌడీలు ఉంటారని ఊహించలేదు. వారు ఏకంగా చంపేస్తున్నారు. పెద్దపెద్ద నాయకులను వాడుకుంటున్నారు. నేరాలు అరికట్టడానికి పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. ఎంటెక్ చేసి కానిస్టేబుల్‌తో సరిపెట్టుకోవాలని అనుకోవద్దు. కష్టపడండి.ప్రతిభకు సాన బెట్టుకోండి."

### నా ఓటమికి ఇది కూడా కారణమే..

"రాజకీయ ముసుగులో నేరాలు చేసే రాజకీయ రౌడీలు తయారయ్యాయి. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య వంటి ఘటనలు నాలాంటి వ్యక్తులకు కొన్ని గుణపాఠాలు నేర్పించాయి. పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని ఆ అనుభవంతో గ్రహించాను. 2019 ఎన్నికల సమయంలో వివేకా హత్య జరిగింది. ముందు గుండెపోటు అంటే... నేను నమ్మాను. కానీ ఆయనది హత్య. ఒక సీఐ దగ్గరుండి ఆయన గదిలోని రక్తం కడిగించారు. ముఖ్యమంత్రిపైనే ఆ నేరాన్ని నెట్టేశారు. నా చేతిలో కత్తి పెట్టి 'నారాసుర రక్తచరిత్ర' అని రాశారు. అప్పుడే విషయం పసిగట్టి నిందితుల్ని పట్టుకుని ఉంటే నేను ఓడిపోయేవాడిని కాదు. ఇప్పుడు నన్ను ఇక ఎవరూ మభ్యపెట్టలేరు."

# మస్క్ సరికొత్త రికార్డు..

# 600 బిలియన్ డాలర్ల సంపద కలిగిన తొలి వ్యక్తిగా ఘనత..!



అమెరికన్ టైకూన్, ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ (%జుశ్రీశీఅ వీబంఎ%) సరికొత్త రికార్డును నెలకొల్పారు. వ్యక్తిగత సందప పరంగా మస్క్ ఏకంగా 600 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరారు (600 %దీఱశ్రీశ్రీఱశీఅ ఱశీశ్రీశ్రీవతీం చీవ్ ఔశీతీష్ట్ర%). తద్వారా ప్రపంచంలోనే తొలిసారి ఈ రికార్డు నెలకొల్పిన వ్యక్తిగా మస్క్ చరిత్ర సృష్టించారు. మస్క్ స్థాపించిన అంతరిక్ష సంస్థ స్పేస్ఎక్స్ విలువ 800 బిలియన్ డాలర్లకు చేరుకుని, ఐపీఓగా వచ్చే అవకాశం ఉందనే వార్తల నేపథ్యంలో ఆయన సంపద ఈ స్థాయికి పెరగడం విశేషం.

%వచ్చే ఏడాది స్పేస్ఎక్స్ (%ూజూఖఎవశ%) పబ్లిక్‌లోకి వెళ్లడానికి సిద్ధమవుతోందని రాయిటర్స్ గత వారం నివేదించిన విషయం తెలిసిందే. స్పేస్ఎక్స్‌లో మస్క్‌కు దాదాపు 42% వాటా ఉంది. ఈ సంస్థ వాల్యూ పెరగడంతో మస్క్ సంపద కూడా వృద్ధి చెందింది. ఒక్క రోజులోనే 168 బిలియన్ డాలర్లు పెరిగి సోమవారం మధ్యాహ్నం సమయానికి మస్క్ నికర సంపద దాదాపు 677 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఫోర్బ్స్ (%ఖీశీతీఎవం%) వెల్లడించింది. ఇక ఈ ఏడాది అక్టోబరులో మస్క్ (%జుశ్రీశీఅ వీబంఎ%) నికర సంపద 500 బిలియన్ డాలర్లు దాటిన సంగతి తెలిసిందే. 2022లో మస్క్ సంపద 200 బిలియన్ డాలర్ల కంటే దిగవుకు పడిపోయింది. ఆ తర్వాత మస్క్ సంపద పెరుగుతూ వస్తోంది. ఈ మూడేళ్లలోనే మస్క్ సంపద 600 బిలియన్ డాలర్లు దాటడం విశేషం. ఇప్పటివరకు ప్రపంచంలో ఏ కుబేరుడు ఈ స్థాయిలో సంపదను ఆర్జించలేదు.

జీతం ట్రిలియన్ డాలర్లు..

మరోవైపు కార్పొరేట్ చరిత్రలోనే అత్యధిక జీతం అందుకుంటున్న సీఈవోగా మస్క్ రికార్డు క్రియేట్ చేశారు. జీతం కింద (%జూఖఎ జూఖఎఝస్త్రవ%) మస్క్‌కు ట్రిలియన్ డాలర్లు ఇచ్చేందుకు టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో గత నెల జరిగిన టెస్లా వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో పే ప్యాకేజీలో కొత్త రికార్డు క్రియేట్ అయ్యింది.

మస్క్‌కు ట్రిలియన్ డాలర్ల పే ప్యాకేజీ అందాలంటే ఆయన ముందు కొన్ని టార్గెట్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టెస్లా మార్కెట్ విలువ 1.4 ట్రిలియన్ల డాలర్లుగా ఉన్నది. అయితే ఆ మార్కెట్ విలువను ఆయన 8.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాల్సి ఉంటుంది. స్వీయ డ్రైవింగ్ చేస్తున్న లక్షల సంఖ్యలో రోబోట్యాక్సీ వాహనాలను ఆయన కమర్షియల్ ఆపరేషన్‌లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఒకవేళ అన్నీ అనుకుట్లే సాగితే, ప్రపంచ కుబేరుడు మస్క్ ప్రపంచంలోనే తొట్టతొలి ట్రిలియనీర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# తులం 1,37,600.. ఒక్కరోజే రూ.4,000 పెరుగుదల

**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:** దేశీయ మార్కెట్‌లో బంగారం ధర మళ్లీ ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరింది. సోమవారం ఒక్కరోజే ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పుత్తడి 10 గ్రాముల విలువ రూ.4,000 పుంజుకున్నది. దీంతో మునుపెన్నడూ లేనివిధంగా తులం రూ.1,37,600కు చేరింది. ఫలితంగా ఈ ఏడాది అక్టోబర్ 17న నమోదైన రూ.1,34,800 రికార్డు కనుమరుగైపోయినైట్టైంది.




ఇదిలావుంటే హైదరాబాద్‌లో రూ.1,470 పెరిగి రూ.1,35,380 పలికింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం రూ.1,350 అందుకుని రూ.1,24,100గా ఉన్నది. కాగా, వెండి ధర శుక్రవారం ముగింపు స్థాయిలోనే యథాతథంగా ఉన్నది.

ఆల్‌టైమ్ హైలోనే కిలో రూ.1,99,500 వద్దే ట్రేడైంది. ఇక ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా పసిడి ధర రూ.58,650 (74.30 శాతం) పెరిగింది. వెండి రేటు రూ.1,09,800 (122.41 శాతం) పుంజుకున్నది. గత ఏడాది డిసెంబర్ 31న బంగారం ధర రూ.78,950గా, వెండి విలువ రూ.89,700గా ఉన్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ మార్కెట్‌లో గోల్డ్ వాల్యూ అంతకంతకూ పెరుగుతూనే ఉన్నది. ఔన్స్ 4,350.06 డాలర్ల వద్ద ముగిసింది. గత 5 రోజుల్లో 159.32 డాలర్లు లేదా 3.80 శాతం ఎగబాకింది. సిల్వర్ ఔన్స్ 63.96 డాలర్లుగా ఉన్నది. గత ట్రేడింగ్ సెషన్‌తో పోల్చితే 2 డాలర్లు పెరిగింది.

# అదానీకి అటవీ భూములు ధారాదత్తం..

## గుజరాత్ విన్నపానికి తలొగ్గి మోదీ సర్కార్ గ్రీన్ సిగ్నల్



**అదానీకి అటవీ భూములు ధారాదత్తం.. గుజరాత్ విన్నపానికి తలొగ్గి మోదీ సర్కార్ గ్రీన్ సిగ్నల్ గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్ కింద అడవుల పెంపకం కోసం రిజర్వ్ చేసిన అటవీ భూములను సైతం అదానీ గ్రూపు తమకు కావాలని డిమాండ్ చేయడంతో ఆ భూములకు విముక్తి చేయాలని బీజేపీ పాలిత గుజరాత్ ప్రభుత్వం.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 16 :** గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్ కింద అడవుల పెంపకం కోసం రిజర్వ్ చేసిన అటవీ భూములను సైతం అదానీ గ్రూపు తమకు కావాలని డిమాండ్ చేయడంతో ఆ భూములకు విముక్తి చేయాలని బీజేపీ పాలిత గుజరాత్ ప్రభుత్వం.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అయితే గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్‌ని పర్యవేక్షించేందుకు కేంద్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఈ అభ్యర్థనపై వెనుకడుగు వేసింది. దట్టమైన అడవులను పెంచేందుకు రిజర్వ్ చేసిన అటవీ భూముల్లో చెట్ల నరికివేతకు అనుమతించడం ఈ కార్యక్రమ లక్ష్యానికే విరుద్ధమని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. దీంతో గుజరాత్ ప్రభుత్వం తమ వాదనను సమర్థించుకుంటూ మరో అభ్యర్థనను కేంద్రానికి పంపింది. ఈ అటవీ భూములపై చెట్లు నాటడానికి ఎవరూ ఇష్టపడటం లేదని, గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్ పరిధి నుంచి ఈ అటవీ భూములను తొలగించాలని రెండో అభ్యర్థనలో గుజరాత్ ప్రభుత్వం కోరింది. దీంతో కరిగిపోయిన కేంద్రం తన నిబంధనలను తానే అతిక్రమిస్తూ గుజరాత్ ప్రభుత్వ అభ్యర్థనకు మొగ్గుచూపింది. మొత్తం 63.44 హెక్టార్ల అటవీ భూమితోపాటు గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్ కోసం రిజర్వ్ చేసిన మొత్తం భూమిపైవున్న ఆంక్షలను ఎత్తివేసింది. 2023 అక్టోబర్‌లో ఎంతో ఆర్భాటంగా మోదీ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనిపై రిపోర్టర్స్ కలెక్టివ్‌%% గుజరాత్ ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించగా అదానీ గ్రూపు కోసం కేంద్రానికి లేఖలేవీ రాయలేదని, ఆ వార్తలు అవాస్తవాలన్నది.

# యశోద హాస్పిటల్స్ ఐపీవో.. ఆర్ఎస్ బ్రదర్స్ పబ్లిక్ ఇష్యూకూ సెబీ ఆమోదం

### మరో ఐదు కంపెనీల నిధుల సమీకరణకు గ్రీన్‌సిగ్నల్




**న్యూఢిల్లీ/హైదరాబాద్, డిసెంబర్ 16 :** హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న యశోద హాస్పిటల్స్ (యశోద హెల్త్‌కేర్ సర్వీసెస్), ఆర్ఎస్ బ్రదర్స్ (ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా) సంస్థల పబ్లిక్ ఇష్యూ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ లేదా ఐపీవో)లకు మార్గం సుగమమైంది. క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం అధికారిక సమాచారం విడుదలైంది. వీటితోపాటు మరో ఐదు కంపెనీల నిధుల సమీకరణకూ పచ్చ జెండా ఊపింది. వాటిలో ముంబైకి చెందిన ఇన్సూర్‌టెక్ వేదిక టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్, కోల్‌కతా ఆధారిత కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సర్వీస్ ప్రొవైడర్ ఫ్యూజన్ సీఎక్స్, నవీ ముంబై కేంద్రంగా సాగుతున్న వ్యర్థ జలాల శుద్ధి పరిష్కారాల కంపెనీ ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్ ఉన్నాయి. అలాగే గురుగ్రామ్‌కు చెందిన ఓరియంట్ కేబుల్స్ ఇండియా, కాన్పూర్ ఆధారిత లోహియా కార్ప్ ఐపీవోలకూ లైన్ క్లియరైంది.

కాగా, ఈ ఏడు సంస్థల్లో యశోద హెల్త్‌కేర్ సర్వీసెస్, టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ రహస్య మార్గంలో ప్రీ-ఫైలింగ్ డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ)ను సెబీకి దాఖలు చేశాయి. మిగతా ఐదు సంస్థలు మాత్రం సాధారణంగానే డ్రాఫ్ట్ పేపర్లను ఫైల్ చేశాయి. ఇక ఈ సంస్థలన్నీ పబ్లిక్ ఇష్యూల ద్వారా మార్కెట్ల నుంచి రూ.10,000 కోట్లకుపైగానే నిధులను సేకరించనున్నాయి. కాగా, ఈ ఏడాది మే-సెప్టెంబర్ మధ్య ఈ సంస్థలన్నీ ఐపీవోల కోసం సెబీకి దరఖాస్తులు చేసుకోగా, ఈ నెల 8-12 మధ్య అనుమతుల్ని అందుకున్నాయి. ఇవన్నీ కూడా ఐపీవోల అనంతరం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)ల్లో నమోదు కానున్నాయి.

**ఆర్ఎస్ బ్రదర్స్ రూ.1,500 కోట్లు**

ఆర్ఎస్ బ్రదర్స్ ఆగస్టులో సెబీకి డీఆర్‌హెచ్‌పీ పత్రాలను దాఖలు చేసింది. రూ.500 కోట్లదాకా ఫ్రెష్ ఈక్విటీ షేర్ల ఇష్యూ ఉండనున్నది. అలాగే మరో 2.98 కోట్ల ఈక్విటీ షేర్లు వాటాదారుల ద్వారా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)కు పెట్టనున్నారు. వీటి విలువ సుమారు రూ.1,000 కోట్లుగా ఉండొచ్చని తెలుస్తున్నది. ఇలా మొత్తంగా రూ.1,500 కోట్ల నిధులను ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా సంస్థ సేకరించనున్నది. ఇక ఈ నిధులను సంస్థాగత రుణ భారాన్ని తీర్చుకోవడానికి, ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఫార్మాట్లలో కొత్త స్టోర్ల ఏర్పాటుకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు వాడుకుంటారని సమాచారం.

**యశోద రూ.4,000 కోట్లు**

యశోద హాస్పిటల్స్ ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.3,000-4,000 కోట్ల మేర నిధులను సమీకరించాలని భావిస్తున్నది. ఇందులో ఫ్రెష్ ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ రెండూ ఉండనున్నాయి. అయితే సెప్టెంబర్‌లో ప్రీ-ఫైలింగ్ డీఆర్‌హెచ్‌పీ దాఖలు చేయడంతో ఐపీవోకు ఏడాదిన్నరదాకా సమయం ఉన్నది. ఈలోగా అప్‌డేటెడ్ డీఆర్‌హెచ్‌పీని దాఖలు చేయాల్సి ఉంటుంది. కాగా, సమీకరించిన ఈ నిధులతో దవాఖానల విస్తరణ, ఇతరత్రా సేవలను బలోపేతం చేయనున్నట్టు సమాచారం.

# కుర్రాళ్లకు కళ్లుచెదిరే ధర..

## వేలంలో కోట్లు కొల్లగొట్టింది వీళ్లే ..!

పంతొమ్మిదో సీజన్ కోసం అబుధాబీలో నిర్వహించిన ఐపీఎల్ మినీ వేలంలో యువక్రికెటర్లు కళ్లు చెదిరే ధర పలికారు. ఆరంభంలోనే కామెరూన్ గ్రీన్ (రూ. 25.20 కోట్లు), మథీశ పథిరన(రూ. 18కోట్లు)లు రికార్డు ధరకు అమ్ముడవ్వగా.. ఆ తర్వాత భారత కుర్రాళ్ల ప్రభంజనం కొనసాగింది. దేశవాళీలో అత్యుత్తమ ప్రదర్శనతో ఫ్రాంచైజీలను ఫిదా చేసిన ప్రశాంత్ వీర్, కార్తిక్ శర్మ అత్యధిక ధర పలికిన అన్‌క్యాప్డ్ ప్లేయర్లుగా అవతరించారు. ఆఖర్లో లియాం లివింగ్‌స్టోన్‌ను రూ. 13 కోట్లకు కొనేసింది ఆరెంజ్ ఆర్మీ. దాంతో.. అతడు టాప్-5లో చోటు సంపాదించాడు.

అంచనాలను తలకిందులు చేస్తూ అనామకులకు పట్టంకట్టిన ఐపీఎల్ వేలం ఆద్యంతం ఆసక్తి రేపింది. చేతినిండా డబ్బులతో కోల్‌కతా నైట్ రైడర్స్ స్టార్ ప్లేయర్లు కామెరూన్ గ్రీన్, మతీశ పథిరనలను పట్టేసింది. దాంతో.. ఆరంభ సీజన్ నుంచి కొనసాగిన విదేశీ క్రికెటర్ల హవా ఈసారి కనిపించింది. అయితే.. ఆ తర్వాత నుంచి భారత యువకెరటాలు భారీ ధరతో వైరలయ్యారు.

నిండా పాతికేళ్లులేని కుర్రాళ్లు అందర్నీ ఆశ్చర్యపరుస్తూ అబుధాబీలో హాట్‌కేకుల్లా అమ్ముడయ్యారు. రూ. 30 లక్షల కనీస ధరతో యాక్షన్‌కు వచ్చిన ప్రశాంత్ వీర్, కార్తిక్ శర్మలు ఏకంగా రూ. 14.2 కోట్లు కొల్లగొట్టారు. మధ్యప్రదేశ్ పేసర్ మంగేశ్ యాదవ్ ఏకంగా రూ. 5.2కోట్లకు అమ్ముడయ్యాడు.




**టాప్ -5లో వీళ్లే**

కామెరూన్ గ్రీన్ - రూ.25.20 కోట్లు, కోల్‌కతా నైట్ రైడర్స్
మథీశ పథిరన - రూ.18 కోట్లు, కోల్‌కతా నైట్ రైడర్స్
కార్తిక్ శర్మ - రూ.14.20 కోట్లు, చెన్నై సూపర్ కింగ్స్
ప్రశాంత్ వీర్ - రూ.14.20 కోట్లు, చెన్నై సూపర్ కింగ్స్
లియాం లివింగ్‌స్టోన్ - రూ.13 కోట్లు, సన్‌రైజర్స్ హైదరాబాద్

## ఐపీఎల్‌లో విధ్వంసక హిట్టర్ పునరాగమనం.. మంచి రోజులొచ్చేశాయా..!




రంజీలకే పరిమితమైన భారత క్రికెటర్ పృథ్వీ షా ఐపీఎల్‌లో పునరామనం చేయనున్నాడు. మంగళవారం అబుధాబీలో జరిగిన మినీ వేలంలో ఈ విధ్వంసక క్రికెటర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ కొనేసింది. తొలి రౌండ్‌లో అతడిని వద్దనుకున్న ఢిల్లీ.. రెండో రౌండ్‌లో రూ. 75 లక్షల కనీస ధరకు మళ్లీ సొంత గూటికి చేర్చుకుంది. దాంతో.. ఇటీవల రంజీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో దంచేసిన షా.. మరోసారి ఐపీఎల్‌లో మెరుపు ఇన్నింగ్స్‌లతో అభిమానులను అలరించనున్నాడు.

ఐపీఎల్‌లో తుఫాన్ ఇన్నింగ్స్‌లతో వైరలైన పృథ్వీ షా.. పదిహేడో సీజన్ తర్వాత అడ్రసే లేకుండా పోయాడు. ఫామ్ లేమితో ఇబ్బందిపడిన ఈ యంగ్‌స్టర్‌ను పద్దెనిమిదో సీజన్లో ఎవరూ కొనలేదు. సో.. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరదతో 19వ సీజన్‌కోసం పేరు నమోదు చేసుకున్నాడు షా. అబుధాబీలో వేలం మొదలైన కాసేపట్లోనే పృథ్వీ పేరు వచ్చినా.. ఏ జట్టు కొనేందుకు ఆసక్తి చూపించలేదు. దాంతో.. ఇక మనోడి పనైపోయిందనకున్నారు అభిమానులు. కానీ, అనూహ్యంగా రెండో దఫాలో అతడిని ఢిల్లీ క్యాపిటల్సే రూ. 75 లక్షల కనీస ధరకు దక్కించుకుంది. అంతే.. 'హమ్మయ్య' అని ఊపిరిపీల్చుకున్నాడీ క్రికెటర్. అయితే.. 2025లో రూ. 8 కోట్లు పలికిన ఈ ముంబై బ్యాటర్ ఈసారి ఇంత తక్కువ ధరకు ఆడాల్సి రావడం ఒకింత బాధాకరమే.

సచిన్ వారసుడు, మరో సెహ్వాగ్.. ఇలా క్రీడా దిగ్గజాల ప్రశంసలు అందుకున్న పృథ్వీ షా కెరీర్ చూస్తుండగానే తలకిందులైంది. ఎంతో ప్రతిభగల అతడు జట్టుకు దూరమవ్వడమే కాదు.. దేశవాళీలోనూ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రోహిత్ చిన్నప్పటి కోచ్ దినేశ్ లాడ్ (%ణఱఅవంష్ర ాఝుచ%) ఒక పాడ్‌కాస్ట్ షోలో షా వైఫల్యానికి కారణాలను విశ్లేషించాడు. 'నేను పృథ్వీ షాను చిన్నప్పటి నుంచి చూస్తున్నా. పదేళ్లకే అతడు ప్రతిభగల క్రికెటర్‌గా అవతరించాడు. కానీ, అనూహ్యంగా కెరీర్‌ను సందిగ్ధంలో పడేసుకున్నాడు. ఎవరి భవిష్యత్ అయినా వారి చేతుల్లోనే ఉంటుంది.

### జోరు చూపలేక నాలుగేళ్లకే..

టీనేజ్ సంచలనంగా 2018లో టెస్టు అరంగేట్రం చేశాడు షా. వెస్టిండీస్‌పై రాజ్‌కోట్‌లో బరిలోకి దిగిన ఈ హిట్టర్ సెంచరీతో తన ఆగమనాన్ని ఘనంగా చాటాడు. అయితే.. ఆ తర్వాత అదే జోరు చూపలేక నాలుగేళ్లకే జట్టులో చోటు కోల్పోయాడు. అనంతరం ఐపీఎల్, దేశవాళీలో పరుగుల వరద పారించిన పృథ్వీ.. పునరాగమనం చేయలేకపోయాడు. అప్పటికే ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్, యశస్వీ జైస్వాల్ జట్టులోకి రావడంతో షాకు దారులు మూసుకుపోయిన విషయం తెలిసిందే.




- జమ్మూకశ్మీర్ అంశంపై మరోసారి చర్చ
- ఐరాసలో ప్రస్తావించిన పాక్ ప్రతినిధి
- కశ్మీర్ వివాదం మిగిలే ఉందన్న ఆసిమ్ ఇఫ్తికర్
- అంతే దీటుగా జవాబిచ్చిన భారత ప్రతినిధి
- కుటిలయత్నాలతోనే పహల్గాం ఉగ్రదాడి
- ఇమ్రాన్‌ను జైలుకి పంపి.. ఆసిమ్ మునీర్‌కు సర్వాధికారాలు
- పాక్‌ను ఎండగట్టిన భారత ప్రతినిధి పర్వతనేని హరీశ్
- ప్రపంచవేదికపై శాంతి చర్చల్లో మరోసారి ప్రస్తావన

# పాక్‌ది.. వక్రబుద్ధి

## కవ్వింపులు, కలహాలే

**న్యూఢిల్లీ,** ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్ మరోసారి పరువు పోగొట్టుకొంది. ప్రపంచ వేదికపై శాంతి గురించి బహిరంగంగా చర్చ జరుగుతుండగా.. జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించి పాక్ తన కుటిల బుద్ధిని చాటుకుంది. దీనికి భారత్ గట్టిగా బదులిచ్చింది. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను జైలుకి పంపి.. అతడికి విరోధి అయిన ఆసిమ్ మునీర్‌కు సర్వాధికారాలు ఇవ్వడంపై చురకలంటించింది. పాక్ ప్రతినిధి ఆసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ మాట్లాడుతూ.. దక్షిణాసియాలో పాక్ శాంతి, స్థిరత్వాన్ని కోరుకుంటుందన్నారు. కానీ, శాంతి ఏకపక్షంగా ఉండకూడదంటూ.. జమ్మూకశ్మీర్ వివాదంపై సమస్య ఇంకా మిగిలిఉందన్నారు. దీనికి న్యాయమైన పరిష్కారం అవసరమన్నారు. సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ ఏకపక్షంగా నిలిపివేసిందని ఆరోపణలు చేశారు.

### గట్టిగా కౌంటరిచ్చిన భారత్..

ఈ వ్యాఖ్యలకు యూఎన్‌లో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ గట్టిగా బదులిచ్చారు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమని పునరుద్ఘాటించారు. భారత్‌కు, దేశంలోని ప్రజలకు ముప్పు తలపెట్టడం పైనే పాక్ దృష్టి ఉంటుందని విమర్శించారు. '65 ఏళ్ల క్రితం విశ్వాసం, సంకల్పం, స్నేహస్ఫూర్తితో భారత్ సింధూ జలాల ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సమయంలో మాపై పాక్ మూడు యుద్ధాలు, వేలాది ఉగ్రదాడులకు పాల్పడి ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఈ నాలుగు దశాబ్దాల్లో పాక్ ఉగ్రవాదుల దాడులతో పదివేల మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు' అని అన్నారు. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్‌లో ఈ ఏడాది జరిగిన పహల్గాం ఉగ్రదాడిని కూడా ప్రస్తావించారు.

### పహల్గాం ఉగ్రదాడి కేసులో ఛార్జిషీటు దాఖలు

పాక్ ఉగ్ర చర్యల కారణంగా భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన విషయాన్ని పర్వతనేని హరీశ్ గుర్తుచేశారు. పాక్ ఉగ్రవాదం ఏ రూపంలో వచ్చినా భారత్ దాన్ని శక్తిమంతంగా ఎదుర్కొంటుందన్నారు. దాయాది దేశంలోని ప్రజాస్వామ్యం, రాజకీయ పరిస్థితులపై హరీశ్ విమర్శలు గుప్పించారు. ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను జైలుకి పంపించి.. రక్షణదళాల చీఫ్ ఆసిమ్ మునీర్‌కు సర్వాధికారాలు అప్పగించిన ఘనత ఆ దేశానికే దక్కుతుందని వ్యాఖ్యానించారు.

# రూపాయి.. బేజారు!

## డాలర్ @₹90.83

- ₹91 మార్క్ దాటొచ్చనే అంచనాలు
- నష్టాల్లోకి దేశీయ మార్కెట్లు
- 400 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్
- ఒత్తిడికి గురవుతున్న మదుపరులు



**న్యూఢిల్లీ,** :అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ రోజు రోజుకూ క్షీణిస్తోంది. భారత్‌అమెరికా డీల్‌పై అనిశ్చితులు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాలతో రూపాయి మారకం విలువ పడిపోతోంది. క్రితం సెషన్‌లో డాలరుతో పోలిస్తే 90.78 వద్ద ముగిసిన రూపాయి విలువ.. మంగళవారం మరో 5 పైసలు క్షీణించింది. 90.83 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠాన్ని తాకింది. ఇక.. భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఆలస్యంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతినడంతో రూపాయిపై ప్రతికూల ప్రభావం పడుతోందని అనలిస్టులు చెబుతున్నారు. మార్కెట్ ఒడుదొడుకులు, డాలర్‌కు డిమాండ్ పెరగడం వంటివి కారణాలుగా పేర్కొంటున్నారు. ఈ క్షీణత మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని, త్వరలో 91 మార్క్ కూడా దాటొచ్చని అంచనా వేస్తున్నారు.

### నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..

అటు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాల్లో కొనసాగుతున్నాయి.ఒకదశలో సెన్సెక్స్ 400 పాయింట్లకు పైగా పతనమవగా.. నిఫ్టీ 25,900 మార్క్ వద్ద ఊగిసలాడుతోంది. ఉదయం 9.45 గంటల సమయంలో సెన్సెక్స్ 359.13 పాయింట్లు దిగజారి 84,854.23 వద్ద, నిఫ్టీ 105.55 పాయింట్ల నష్టంతో 25,921.75 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, మదుపర్ల అప్రమత్తత సూచీలను ఒత్తిడికి గురిచేస్తున్నాయి.

# మందుల చీటీ వంకరటింకర!

## ఇకపై ఆ ఇబ్బంది ఉండదు



- డాక్టర్ల ప్రిస్క్రిప్షన్లపై జాతీయ వైద్య కమిషన్ కీలక ఆదేశాలు
- చేతిరాత స్పష్టంగా, అర్థమయ్యేలా ఉండాలని సూచన
- పర్యవేక్షణకు ప్రత్యేక సబ్-కమిటీ ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు
- జనరిక్ పేర్లతోనే మందులు రాయడం తప్పనిసరి

**న్యూఢిల్లీ,** :డాక్టర్లు రాసే ప్రిస్క్రిప్షన్లు (మందుల చీటీలు) స్పష్టంగా, చదవడానికి వీలుగా ఉండాలని జాతీయ వైద్య కమిషన్ (NMC) స్పష్టం చేసింది. ఈ నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు ప్రతి వైద్య కళాశాలలో ఒక ప్రత్యేక సబ్‌కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తాజాగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. స్పష్టమైన ప్రిస్క్రిప్షన్ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రజల ఆరోగ్య హక్కులో అంతర్భాగమని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్న విషయాన్ని ఎన్‌ఎంసీ గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో ప్రతి మెడికల్ కాలేజీలోని డ్రగ్స్ అండ్ థెరప్యూటిక్స్ కమిటీ (డీటీసీ) కింద ఒక సబ్‌కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ కమిటీ ప్రిస్క్రిప్షన్లను క్రమం తప్ప కుండా సమీక్షిస్తుంది. వైద్యులు మం దులు రాసే పద్ధతులను పరిశీలించి, నిబంధనల ఉల్లంఘనలను గుర్తిస్తుం ది. వాటిని సరిదిద్దడానికి అవసరమైన చర్యలను సిఫార్సు చేస్తుంది.


### జనరిక్ పేర్లతో రాయాల్సిందే..

ఈ కమిటీ నివేదికలను డీటీసీ సమావేశ మినిట్స్‌లో నమోదు చేయాలని, అవసరమైనప్పుడు ఆ నివేదికలను తమకు సమర్పించాలని ఎన్‌ఎంసీ పేర్కొంది. మందుల చీటీలో చేతిరాత స్పష్టంగా ఉండటంతో పాటు వీలైతే క్యాపిటల్ లెటర్స్‌లో రాయాలని తెలిపింది. అలాగే మందులను వాటి జనరిక్ పేర్లతోనే రాయడం, అనవసరమైన మందులు సూచించకుండా హేతుబద్ధత పాటించడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ పర్యవేక్షణ వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేసి, అమలు చేయాలని అన్ని వైద్య కళాశాలలను ఆదేశించింది.

# గర్ల్‌ఫ్రెండ్.. ఊరెళ్తోంది

## ప్రియురాలి కోసం లీవ్

- ఉద్యోగి నిజాయితీకి మేనేజర్ ఫిదా
- ప్రియురాలితో గడిపేందుకు సెలవు కోరిన ఉద్యోగి
- నిజాయితీని మెచ్చుకుంటూ పోస్ట్ పెట్టిన మేనేజర్
- గతంలో ఇలాంటి వాటికి సిక్ లీవ్ పెట్టేవారని వ్యాఖ్య
- సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన




**న్యూఢిల్లీ,** మారుతున్న ఆఫీస్ కల్చర్‌కు అద్దం పట్టే ఘటన ఇది. ఓ ఉద్యోగి తన ప్రియురాలితో సమయం గడిపేందుకు సెలవు కోరుతూ పంపిన ఈమెయిల్‌ను అతడి మేనేజర్ లింక్డ్ఇన్‌లో షేర్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఉద్యోగి నిజాయతీని, మేనేజర్ స్పందించిన తీరును నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ఓ ఉద్యోగి తన మేనేజర్‌కు సెలవు కోసం ఈమెయిల్ పంపాడు. అందులో, "సర్, డిసెంబర్ 16వ తేదీనన నాకు సెలవు కావాలి. నా గర్ల్‌ఫ్రెండ్ 17వ తేదీన ఉత్తరాఖండ్‌లోని వాళ్ల సొంత ఊరికి వెళ్తోంది. మళ్లీ జనవరి మొదటి వారం వరకు తిరిగి రాదు. అందుకే ఆమె వెళ్లే ముందు ఆ రోజంతా తనతో గడపాలనుకుంటున్నాను. దయచేసి సెలవు మంజూరు చేయగలరు" అని నిజాయతీగా కోరాడు.

### ఇలా రాయడం బాగా నచ్చింది..

అయితే.. ఈ ఈమెయిల్ స్క్రీన్‌షాట్‌ను షేర్ చేసిన మేనేజర్ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "కొంతకాలం క్రితం నా ఇన్‌బాక్స్‌కు ఈ మెయిల్ వచ్చింది. పదేళ్ల క్రితమైతే ఇలాంటి కారణానికి ఉదయం 9:15 గంటలకు 'ఆరోగ్యం బాగాలేదు' అని ఓ మెసేజ్ వచ్చేది. కానీ.. ఇప్పుడు ఎంతో పారదర్శకంగా ముందుగానే అడిగారు. కాలం మారుతోంది. నిజం చెప్పాలంటే నాకీ కొత్త పద్ధతే బాగా నచ్చింది. ప్రేమకు మనం కాదనలేం కదా? లీవ్ అప్రూవ్ చేశాను" అని తన పోస్టులో రాసుకొచ్చారు. ఈ పోస్ట్ లింక్డ్ఇన్‌లో వేలాది మందిని ఆకట్టుకుంది. ఉద్యోగి నిజాయతీ, మేనేజర్ సానుకూల దృక్పథం కార్యాలయంలో నమ్మకాన్ని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందిస్తాయని చాలామంది కామెంట్లు చేశారు. అయితే, మరికొందరు మాత్రం వ్యక్తిగత సెలవులకు కారణాలు చెప్పాల్సిన అవసరం ఏముందని 'పర్సనల్ లీవ్ కావాలి' అని అడిగితే సరిపోయేదని అభిప్రాయపడ్డారు.

## యువ వైద్యురాలికి వరకట్న వేధింపులు


### ₹12.5 కోట్లు తేవాలన్న అత్తింటి వారు

- పెళ్లి సమయంలో కట్నంగా భారీగా నగదు, నగలు
- అయినా అదనపు కట్నం కావాలని ఇబ్బందులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

**విజయవాడ,** :పెళ్లైన ఏడాది నుంచే అదనపు కట్న వేధింపులు ఎదుర్కొంటున్న ఓ యువ వైద్యురాలు అత్తింటి వేధింపుల నుంచి తనను కాపాడాలని పోలీసులను ఆశ్రయించిన ఉదంతమిది. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన ఓ యువతి (30) గైనకాలజీలో ఎంఎస్ చేశారు. కార్డియాలజీలో పీజీ చదువుతున్న.. కర్నాటకలోని రాయచూర్ జిల్లాకు చెందిన యువకుడితో 2024 నవంబరులో పెళ్లి అయ్యింది. అప్పట్లో కట్నం కింద ₹1.5 కోట్ల నగదు, 200 సవర్ల బంగారం, 10 కిలోల వెండి, ₹30 లక్షల విలువైన గృహోపకరణాలు, ₹50 లక్ష ల ఆ డపడుచు లాంఛనాలు ఇచ్చారు. తాజాగా, ఆసుపత్రి నిర్మాణం కోసం ₹12.5 కోట్ల అద నపు కట్నం తీసుకురావాలని భర్తతో పాటు అత్తమామలు, ఆడపడుచు ఆమెను వేధించారు. ఈ ఏడాది సెప్టెంబరులో ఆమె పుదుచ్చేరిలోని ఓ ఆస్పత్రిలో ఆడపిల్లకు జన్మనివ్వగా, చూసేందుకు వచ్చిన భర్త.. తన భార్య, పసికందును ఆస్పత్రిలోనే వదిలేసి వెళ్లిపోయాడు. విడాకులు ఇవ్వాలని బెదిరించాడు. చివరకు గొల్లపూడిలోని పుట్టింటికి చేరిన ఆ వైద్యురాలు.. భర్త, అత్తమామలు, ఆడపడుచు, ఇతర బంధువులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## ప్రజల వద్దకే పాలన

- నిత్యం అందుబాటులో కూటమి నేతలు
- సమస్యల పరిష్కార వేదిక చూపింది బాబునే
- ప్రజల ఆశలు ఆకాంక్షలు నెరవేరుస్తున్న ప్రభుత్వం



**విజయవాడః** ప్రజల వద్దకు నేరుగా పాలన తీసుకువచ్చిన ఘనత చంద్రబాబు నా యుడుకే దక్కుతుందని కేడీసీసీ చైర్మన్ ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు మాజీ మంత్రి నెట్టెం రఘురాం పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని అక్కడికక్కడే వాటికి పరిష్కార మార్గం చూపించేందుకు ప్రజా దర్బారు నిర్వహించడం శుభ పరిణామమని చెప్పారు. విజయవాడలోని పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 15 నెలల కూటమి పాలనలో ఎన్నో సంస్కరణలు తీసుకురావడం జరిగిందని, ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నేరుగా ప్రజల వద్దకే ప్ర జా ప్రతినిధులు అధికారులు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారాన్ని చూపించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకు వెళ్తున్న ఆయన, సంక్షేమాన్ని కూడా సమపాళ్లలో అందిస్తూ ఉన్నామన్నారు. కూటమి నాయకులు అధికారుల సమన్వయంతో ప్రజా దర్బారులో ప్రజల నుండి వినతులు స్వీకరించి చక్కటి పరిష్కార మార్గాలు చూపిస్తున్నామన్నారు. ప్రజలకు ఇదొక మంచి అవకాశంగా ఉందన్నారు.

## ఆర్థిక రాజధానిగా అమరావతి

- ముఖ్య బ్యాంకుల ఏర్పాటు శుభ పరిణామం
- అమరావతికి రావడంలో అధికారుల పాత్ర కీలకం
- తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు..
- ఢిల్లీలో ఆర్థిక శాఖ అధికారులతో మర్యాదపూర్వక భేటీ..



ప్రపంచ దేశాలకే తలమానికంగా అమరావతి రూపొందుతుందని ఇందులో అతి ముఖ్యమైన ఆర్థిక రాజధానిగా మారడం ఖాయమని తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఇటీవల అమరావతిలో 29 బ్యాంకింగ్ సంస్థల ఏర్పాటులో కీలక భూమి పోషించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తన సహచర మిత్రుడు కేంద్ర ఆర్థిక శాఖలో ఆర్థిక సర్వీసుల శాఖ కార్యదర్శి సీనియర్ ఐఏఎస్ అధికారి మద్దిరాల నాగరాజును ఢిల్లీలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఢిల్లీలో ఆయన కార్యాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అమరావతిలో 29 ముఖ్యమైన బ్యాంకుల ఏర్పాటు వాటి కార్యకలాపాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అమరావతి రాజధాని లో జరుగుతున్న పనులు వాటి ప్రగతి రానున్న రోజులలో భవిష్యత్ తరాలకు అందించే ఫలాల వివరాలను ఆయన వివరించారు. ఢిల్లీ పర్యటనలో ఎమ్మెల్యే కొడుకు శ్రీనివాసరావు పలువురు పెద్దలను కూడా కలుసుకొనున్నారు.

# 'రాజాసాబ్' రన్ టైమ్ ఎంత?



ప్రభాస్ రాజాసాబ్ సినిమాతో సంక్రాంతికి రాబోతున్నాడు. ఈ సినిమా ఇప్పటికే పలుమార్లు వాయిదా పడటం, రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్ కూడా అంతగా ఇంపాక్ట్ చూపించకపోవడంతో సినిమాపై అంచనాలు మామూలుగానే ఉన్నాయి. ఫ్యాన్స్ కూడా రాజాసాబ్ సినిమాపై పెద్దగా ఆశలు పెట్టుకోవట్లేదు. తాజాగా రాజాసాబ్ సినిమా గురించి ఆసక్తికర సమాచారం వినిపిస్తుంది.

రాజాసాబ్ సినిమా షూటింగ్ ముగించుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే ఈ సినిమా షూటింగ్ టోటల్ ఫుటేజ్ మొత్తం కలిపి ఏకంగా నాలుగు గంటల పైనే వచ్చిందట. దీంతో చాలా వరకు ఎడిటింగ్ చేసేస్తున్నారట. ఎంత ఎడిట్ చేసినా మూడు గంటల 15 నిముషాలు మాత్రం ఉంటుందట. చివరకు మారుతి, ప్రభాస్ డిస్కస్ చేసుకొని రాజాసాబ్ సినిమా నిడివి మూడు గంటల పది నిమిషాలకు తెచ్చారని తెలుస్తుంది.

హారర్ కామెడీ, ప్రభాస్ – హీరోయిన్స్ మీద సాంగ్స్ తో మూడు గంటల పది నిముషాలు థియేటర్లో కూర్చోబెడతారా చూడాలి. కొన్నేళ్ల క్రితం ఎన్టీఆర్, ఏఎన్నార్ కాలంలో నాలుగు గంటలు, మూడున్నర గంటల సినిమాలు ఉండేవి. మళ్ళీ ఇప్పుడు గత కొంతకాలం నుంచి మూడు గంటలు, ఆ పైన ఉన్న సినిమాలు వస్తున్నాయి. మరి మూడు గంటల పది నిముషాలు నిడివి ఉన్న రాజాసాబ్ సినిమా ప్రేక్షకులను, ఫ్యాన్స్ ని ఎలా మెప్పిస్తుందో చూడాలి.

# ఏదైనా ఉంటే నేనే చెబుతా..



టాలీవుడ్‌లో తన తొలి సినిమాతోనే ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న హీరోయిన్లలో మెహ్రీన్ పీర్జాదా ఒకరు. 'కృష్ణగాడి వీర ప్రేమ గాథ' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ పంజాబీ భామ, తన క్యూట్ లుక్స్‌తో పాటు సహజమైన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. నాని సరసన నటించిన ఆ చిత్రంలో 'మహాలక్ష్మి' పాత్రలో మెహ్రీన్ చేసిన నటనకు ప్రశంసలు దక్కాయి. ఆ తర్వాత 'మహానుభావుడు', 'రాజా ది గ్రేట్', 'F2', 'F3' వంటి వరుస విజయాలతో టాలీవుడ్‌లో లక్కీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. ఒక దశలో టాలీవుడ్‌లో అత్యంత బిజీ నటిగా కొనసాగిన మెహ్రీన్, గత కొంతకాలంగా సినిమాలకు కొంత దూరంగా కనిపిస్తోంది.

సినిమాల పరంగా గ్యాప్ వచ్చినప్పటికీ, మెహ్రీన్ పేరు మాత్రం సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు చర్చలోనే ఉంటుంది. అయితే ఈసారి ఆమె కెరీర్ విషయాలకన్నా, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన రూమర్స్ కారణంగా వార్తల్లో నిలిచింది. గత కొన్ని రోజులుగా మెహ్రీన్ సీక్రెట్‌గా పెళ్లి చేసుకుందంటూ నెట్టింట ప్రచారం జరిగింది. ఓ వ్యక్తితో ఆమె వివాహం పూర్తయ్యిందని, ఇప్పటికే పెళ్లి బంధంలోకి అడుగుపెట్టిందంటూ కొన్ని కథనాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వార్తలకు మరింత బలం చేకూర్చినట్లుగా, ఒక ప్రముఖ మీడియా సంస్థ కూడా ఈ అంశంపై కథనం ప్రచురించడం చర్చకు దారితీసింది.

ఈ వ్యవహారం ఎక్కువగా ముదిరిపోవడంతో ఇప్పటివరకు మౌనంగా ఉన్న మెహ్రీన్ చివరకు స్పందించాల్సి వచ్చింది. గత రెండేళ్లుగా తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న తప్పుడు ప్రచారాలను పట్టించుకోలేదని, కానీ ఈసారి మాత్రం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం వచ్చిందని ఆమె అసహనం వ్యక్తం చేసింది. తనకు అసలు పరిచయం కూడా లేని వ్యక్తితో పెళ్లి జరిగిందంటూ వార్తలు రాయడం బాధ కలిగిస్తోందని చెప్పింది. తాను ఇప్పటివరకు ఎవరినీ వివాహం చేసుకోలేదని, భవిష్యత్తులో పెళ్లి గురించి ఏదైనా నిర్ణయం తీసుకుంటే అది తానే అధికారికంగా ప్రకటిస్తానని స్పష్టం చేసింది. ఇలాంటి నిరాధార వార్తలను ప్రచారం చేయొద్దని ఆమె మీడియా, నెటిజన్లను కోరింది.

మెహ్రీన్ వ్యక్తిగత జీవితానికి సంబంధించి గతంలోనూ కొన్ని ఒడిదుడుకులు చోటుచేసుకున్నాయి. కెరీర్ పీక్‌లో ఉన్న సమయంలో, 2021లో హర్యానా మాజీ ముఖ్యమంత్రి భజన్ లాల్ మనవడు భవ్య బిష్ణోయ్‌తో ఆమె నిశ్చితార్థం జరిగింది. ఈ వార్త అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. అయితే పెళ్లి వరకు వెళ్లకముందే, వ్యక్తిగత కారణాలతో వీరిద్దరూ తమ బంధాన్ని ముగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం అభిమానులకు షాక్ ఇచ్చినా, ఆ తర్వాత మెహ్రీన్ తన ప్రొఫెషనల్ లైఫ్‌పై దృష్టి పెట్టింది. ఆ తర్వాత కూడా ఆమె పేరుతో పలు గాసిప్స్ వినిపించాయి. మధ్యలో మెగా హీరో సాయి ధరమ్ తేజ్‌తో ప్రేమాయణం సాగుతోందంటూ పుకార్లు వచ్చినప్పటికీ, వాటికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో అవన్నీ వదంతులుగానే మిగిలిపోయాయి.

# 'ఓజీ' దర్శకుడికి పవన్ కల్యాణ్ అదిరే గిఫ్ట్

పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా ఈ ఏడాది వచ్చిన 'ఓజీ' సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ అయ్యింది. డైరెక్టర్ సుజీత్ తెరకెక్కించిన ఈ సినిమా సెప్టెంబర్ 25న రిలీజైంది. తొలి రోజే ఈ సినిమా రూ.150+ కోట్ల గ్రాస్ వసూల్ చేసి పవన్ కల్యాణ్ కెరీర్ లోనే హైయ్యెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన సినిమాగా రికార్డ్ కొట్టింది. ఇందులో వింటేజ్ పవన్‌ను చూశామంటూ అభిమానులు సంబరాలు చేసుకున్నారు.




అయితే తనకు బ్లాక్‌బస్టర్ సినిమా ఇచ్చిన డైరెక్టర్ కు పవర్ స్టార్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. డైరెక్టర్ సుజీత్ కు పవన్ ఖరీదైన కారును గిఫ్ట్‌గా ఇచ్చారు. ఈ కారును పవన్ స్వయంగా దర్శకుడు సుజీత్‌కు అందించారు. ఈ విషయాన్ని సుజీత్ సోషల్ మీడియాలో వెల్లడించారు. ఇది ఆయనకు లైఫ్‌లో అందిన బెస్ట్ గిఫ్ట్ అని పేర్కొన్నారు.

'ఇది నాకు బెస్ట్ గిఫ్ట్. దీనిపై నాకు మాటలు రావట్లేదు. చిన్నప్పటి నుంచి ఆయన అభిమానిగా ఉన్నా నాకు ఇది స్పెషల్ మూమెంట్. ఆయన నుంచి లభించే ప్రేమ, ప్రోత్సాహమే నాకు సర్వస్వం. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాను' అని సుజీత్ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో పవన్‌తోపాటి తీసుకున్న ఫొటోను షేర్ చేశారు.

కాగా, లాంగ్ రన్‌లో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసింది. ఇందులో రూ. 170 కోట్ల షేర్ ఉండడం విశేషం. ఇందులో ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటించారు. సీనియర్ నటుడు ప్రకాశ్ రాజ్, అర్జున్ దాస్, శ్రీ యా రెడ్డి, ప్రకాష్ రాజ్ ముఖ్య పాత్రల్లో నటించారు కీలక పాత్ర పోషించారు. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి విలన్‌గా ఆకట్టుకున్నారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించగా ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించగా, తమన్ ఎస్.ఎస్ సంగీతం అందించారు.

# గోల్డెన్ గౌనులో అనన్యపాండే ధగ ధగ



బాలీవుడ్‌లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది అనన్య-పాండే. లైగర్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పిన ఈ భామ ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్‌తో కలిసి Tu Meri Main Tera Main Tera Tu Meri సినిమాలో నటిస్తోంది. సమీర్ సంజయ్ విద్వాన్స్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా ఎప్పటికప్పుడు నెట్టింట సెగలు పుట్టించే ఈ భామ తాజాగా ఫిలింఫేర్ ఓటీటీ అవార్డ్స్ 2025 ఈవెంట్‌లో సందడి చేసింది. గోల్డెన్ గౌనులో ధగ ధగ మెరిసిపోతూ ర్యాంప్‌పై వాక్ చేసింది. కామెడీ డ్రామా సిరీస్ Call Me Baeకిగాను ఉత్తమ నటిగా అవార్డు సొంతం చేసుకుంది. ఓ వైపు చేతిలో అవార్డు పట్టుకున్న అనన్యపాండే.. మరోవైపు మేలిమి బంగారంలో మెరిసిపోతున్న స్టిల్స్ ఇప్పుడు నెట్టింట రౌండప్ చేస్తున్నాయి.

లేటెస్ట్ గా 'లెనిన్' సినిమా గురించి సినీ వర్గాల్లో ఒక హాట్ టాపిక్ నడుస్తోంది.



అదేంటంటే... ఈ చిత్రంలో ఒక స్పెషల్ సాంగ్ ను అత్యంత భారీ స్థాయిలో డిజైన్ చేస్తున్నారట. ఈ స్పెషల్ సాంగ్ కోసం బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ఆ లక్కీ బ్యూటీ మరెవరో కాదు... అనన్య పాండే. బాలీవుడ్‌లో తన గ్లామర్‌తో, డ్యాన్స్‌తో యువతను ఆకర్షిస్తున్న అనన్య పాండే... ఈ స్పెషల్ సాంగ్‌తో పాటు, సినిమాలో ఓ చిన్న అతిథి పాత్రలో కూడా కనిపించబోతోందని గుసగుసలు వినిపిస్తున్నాయి. తెలుగులో అఖిల్, అనన్యల కాంబినేషన్ తెరపై అద్భుతమైన కెమిస్ట్రీని పంచుతుందని ఫ్యాన్స్ అంచనా వేస్తున్నారు. అయితే, ఈ స్పెషల్ సాంగ్ గురించి అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది.

# బ్లాక్‌బస్టర్ గుజరాతి మూవీ ఓటీటీలోకి ఎప్పుడంటే?

చిన్న సినిమాగా విడుదలైన గుజరాతీ "లాలూ శ్రీ కృష్ణ సదా సహాయతే" రికార్డులు తిరగరాస్తోంది. కేవలం రూ.50 లక్షల బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా రూ. 100 కోట్లకు పైగా వసూలు చేసింది. ఇంత చిన్న సినిమా భారీ విజయం సాధించడంతో ట్రేడ్ పండితులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. టికెట్ బుకింగ్ యాప్ బుక్‌మైషోలో ఈ సినిమా సుమారు రెండు నెలలు ట్రెండింగ్‌లో కొనసాగింది.


ఈ సినిమా గురించి తెలుసుకున్న ప్రేక్షకులు ఓటీటీ విడుదల తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా విడుదలైన కొత్తలో కొద్ది రోజుల పాటు బాక్సాఫీస్ వద్ద ఇబ్బందులు పడింది. తర్వాత ప్రేక్షకుల నుంచి వచ్చిన పాజిటివ్ మౌత్ టాక్ కారణంగా టిక్కెట్ సేల్స్ ఒక్కసారిగా ఉపందుకున్నాయి. చిన్న సినిమాలలో అత్యధిక వసూళ్లు సాధించిన గుజరాతీ చిత్రంగా ఇది నిలిచింది.

"లాలూ - శ్రీ కృష్ణ సదా సహాయతే" కథ ఒక రిక్షా డ్రైవర్ చుట్టు తిరుగుతుంది. ఇది ఒక భక్తిరస నాటకీయ సినిమా. ఎవరూ లేని ఫామ్‌హౌస్‌లో చిక్కుకున్న హీరో తన గతాన్ని తలుచుకుంటాడు. ఈ క్రమంలో శ్రీకృష్ణుని సూక్తులు అతనికి గుర్తుకు వస్తాయి. అవి అతనిని విముక్తి, మానసిక ప్రశాంతత వైపు తీసుకెళ్తాయి. ఇదే ఇతివృత్తంగా సినిమా రూపొందింది.

ఇంత చిన్న బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా ఈ ఏడాది అక్టోబర్ 10న గ్రాండ్‌గా రిలీజైంది. మంచి స్పందన రావడంతో డిస్ట్రిబ్యూటర్లకు సైతం భారీ లాభాలు తీసుకొచ్చింది. అయితే సినిమా థియేటర్ రన్ 8 వారాలు దాటినప్పటికీ, ఈ సినిమా ఇప్పటిదాకా ఓటీటీ డీల్ క్లోజ్ అవ్వలేదు. ఇప్పటికే మేకర్స్‌కు పలు ఓటీటీల నుంచి భారీ స్థాయిలోనే ఆఫర్లు వచ్చి ఉంటాయి. కానీ ఇప్పటి వరకు డిజిటల్ ప్లాట్‌ఫామ్, స్ట్రీమింగ్ తేదీ గురించి సినీబృందం ఎలాంటి స్పష్టతనివ్వలేదు. మరోవైపు, సినిమా ఎక్కువ మంది ప్రేక్షకులను చేరుకోవడానికి దీనిని ఇతర భాషలలో కూడా విడుదల చెయ్యలనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి.

"లాలూ -శ్రీ కృష్ణ సదా సహాయతే" సినిమాకు అంకిత్ సఖియా దర్శకత్వం వహించారు. ఇందులో రీవా రాచ్, శ్రుహద్ గోస్వామి, కరణ్ జోషి, మిష్టీ కడేచా తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాని మానసి పరేఖ్, పార్థివ్ గోహిల్, మ్యానిఫెస్ట్ ఫిల్మ్స్, జయ వ్యాస్ ప్రొడక్షన్స్, అజయ్ బల్వంత్ పదారియా కలిసి నిర్మించారు. ఈ సినిమాకి స్మిత్ జయ సంగీతం అందించారు.

# బాలకృష్ణ సలహాలతోనే సమస్యను అధిగమించాం..: బోయపాటి



నందమూరి బాలకృష్ణ ఇచ్చిన సలహాలు, సూచనలతోనే 'అఖండ 2' సినిమా విడుదల సమస్యలను అధిగమించగలిగామని దర్శకుడు బోయపాటి శ్రీను స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల చివరి నిమిషంలో సినిమా వాయిదా పడినప్పుడు బాలకృష్ణ తమకు అండగా నిలిచారని తెలిపారు.

బాలకృష్ణ, బోయపాటి కాంబినేషన్‌లో వచ్చిన 'అఖండ 2' ఇటీవల డిసెంబరు 12న విడుదలైంది. వాస్తవానికి ఈ సినిమా డిసెంబరు 5నే విడుదల కావాల్సి ఉండగా, నిర్మాతలకు ఎదురైన ఆర్థిక సమస్యల వల్ల వాయిదా పడింది. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బోయపాటి ఈ అంశంపై మాట్లాడారు.

విడుదల వాయిదా పడినప్పుడు తాను టెన్షన్ పడలేదని, కానీ బాలయ్య అభిమానుల గురించి మాత్రం చాలా భయపడ్డానని బోయపాటి అన్నారు. "షోకు రెండు మూడు గంటల ముందు రద్దు చేస్తే అభిమానుల కోపాన్ని నియంత్రించడం కష్టం. అడ్వాన్స్ టికెట్లు కొన్నవారి ఆవేదనను మేము అర్థం చేసుకున్నాం. అందుకే ముందుగా థియేటర్ల వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా చూశాం. ఆ తర్వాత బాలకృష్ణ గారితో చర్చించి, ఆయన సలహాలు పాటిస్తూ సినిమాను విడుదల చేశాం" అని వివరించారు.

ఈ సినిమాకు శివుడి సెంటిమెంట్ ఏమైనా అడ్డువచ్చిందా అని విలేకరులు అడగ్గా, ఇది శివుడి సినిమా కాదని, శివ భక్తుడి కథ అని బోయపాటి బదులిచ్చారు. డబ్బు కోసం ఈ సినిమా తీయలేదని, ఇది సందేశాత్మక చిత్రం కూడా కాదని, కేవలం కమర్షియల్ హంగులతో వినోదాన్ని పంచే చిత్రమని స్పష్టం చేశారు. ప్రస్తుతం 'అఖండ 2' థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.

# ప్లాస్టిక్ సర్జరీ కామెంట్స్ పై ఫైరయిన రకుల్ ప్రీత్



ఎప్పుడు గ్లామర్ గా నాజూగ్గా కనిపించే రకుల్ ప్రీత్ సింగ్ ప్రస్తుతం మాత్రమే కాదు నిత్యం సోషల్ మీడియాలో చాలా యాక్టీవ్ గా ఉంటుంది. గ్లామర్ షో తోనే రకుల్ ప్రీత్ వార్తల్లో నిలుస్తుంది. రీసెంట్ గా బాలీవుడ్ లో దే దే ప్యార్ దే 2 హిట్ తో రకుల్ కెరీర్ గాడిన పడింది. అయితే తాజాగా రకుల్ ప్రీత్ సన్నబడేందుకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంది అంటూ ఓ డాక్టర్ ఆమె పై సెన్సేషనల్ కామెంట్స్ చేసారు.

ఒకప్పుడు బొద్దుగా ఉన్న రకుల్ ప్రీత్ ఇప్పుడు ఇలా చాలా సన్నగా అవ్వడానికి కారణం.. ఆమె ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంది అంటూ ఆ డాక్టర్ సోషల్ మీడియాలో ఓ వీడియో పోస్ట్ చేశాడు. ఆ డాక్టర్ పై రకుల్ ప్రీత్ ఓ రేంజ్ లో ఫైర్ అయ్యింది. అసలు అతను డాక్టరేనా అంటూ అతనిపై రకుల్ రెచ్చిపోయింది.

ఎవరి గురించైనా మాట్లాడే ముందు అన్ని నిజాలు తెలుసుకుని మాట్లాడాలి, ఒక నటిగా తనకు ప్రాచీన, ఆధునిక శాస్త్రాల గురించి తెలుసని.. ప్లాస్టిక్ సర్జరీ చేసుకోవడం తప్పు కాదని.. కాకపోతే కేవలం ప్లాస్టిక్ సర్జరీతోనే బరువు తగ్గుతారనేది నిజం కాదు, కష్టపడి వ్యాయామాలు చేసి కూడా బరువును తగ్గించుకోవచ్చు అంటూ రకుల్ సదరు

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; Mahesh Babu
RNI No: APTEL/2012/46499Phone No 9849499960,9059696959 Email id: Pallevelugu@gmail.com